STV SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 126 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శుక్రవారం 20 నవంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |



## తీరాన్ని వణికిస్తున్న 'అక్వాన్'!

# 36 గంటలు కీలకం

**నేటి మధ్యాహ్నం గోపాల్‌పూర్ వద్ద తీరం దాటే అవకాశం**

- ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు.. 80 కి.మీ. వేగంతో గాలులు
- ముందస్తుగా 39 రైళ్లు రద్దు.. విమాన సర్వీసులపై ప్రభావం
- తీరంలో అల్లకల్లోలంగా సముద్రం.. వేటకు వెళ్లొద్దని హెచ్చరిక
- ఒడిశాలో లక్ష మందికి పైగా సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

"పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో బలపడిన 'అక్వాన్' తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్, ఒడిశా తీరాల వైపు వేగంగా దూసుకొస్తోంది. గంటకు 12 కిలోమీటర్ల వేగంతో పయనిస్తున్న ఈ తుపాను శుక్రవారం మధ్యాహ్నానికి నరసాపురంఉపూరీ మధ్య గోపాల్‌పూర్ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ, ఆర్టీజీఎస్ అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలతో పాటు తీరం వెంబడి గంటకు గరిష్ఠంగా 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది."

3



ప్రభుత్వ ఆస్పత్రుల్లో

## రోబోటిక్ శస్త్రచికిత్సలు!

వైద్యారోగ్య శాఖ సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్

.. వివరాలు 2లో



గెలిచిందెవరు..

## ఓడింది ఎవరు?

స్థానిక ఎన్నికలపై 'ఎక్స్'లో విజయసాయిరెడ్డి పోల్

.. వివరాలు 3లో

## షర్మిలపై తప్పుడు ప్రచారాలు

కలచివేస్తున్నాయి

వైఎస్ విజయమ్మ పేరుతో బహిరంగ లేఖ



.. వివరాలు 3లో




## మూడు ఆర్థిక ఇంజిన్లు..

# పెట్టుబడుల వెల్లువ!


విశాఖ, తిరుపతి, అమరావతిపై సీఎం సమీక్ష

**అమరావతిలో రూ.4.65 లక్షల కోట్ల పెట్టుబడులు**

- విశాఖలో యాంకర్‌గా 'వైజాగ్ బే సిటీ'
- ఉత్తరాంధ్రలో 2 లక్షల ఐటీ ఉద్యోగాల లక్ష్యం
- తిరుపతి పరిధిలో 66 గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు
- తిరుపతి రీజియన్‌లో 14 పారిశ్రామిక నగరాలు
- మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల పూర్తికి వేగం
- అరకు, కోనసీమ, సూర్యలంకలో పర్యాటక హబ్‌లు

**అమరావతి, నవంబర్ 19 (సమయం న్యూస్):** ప్రాంతీయ సమతుల్య అభివృద్ధి, భారీ పెట్టుబడులతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఉద్యోగాలు సృష్టించేందుకు ప్రభుత్వం భారీ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా విశాఖపట్నం, తిరుపతి, అమరావతి ఎకనమిక్ రీజియన్ల అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. మూడు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల పురోగతిపై అధికారులు సీఎంకు ప్రజంటేషన్ ఇచ్చారు. ఆయా ప్రాంతాల వనరులకు అనుగుణంగా ఉత్తరాంధ్రలో పోర్టులు,

మిగతా 2 లో



## స్థానిక ఎన్నికల్లో కూటమి గెలుపే లక్ష్యం

- 2024 కంటే ఎక్కువ ఓట్ల శాతం సాధించాలి
- పొత్తు ధర్మానికి కట్టుబడి సమష్టిగా పనిచేయాలి
- ఒక్క వార్డులో ఓడినా కారణాలు విశ్లేషిస్తా
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

2

## పెట్టుబడుల్లో 'ఇండియా ఫస్ట్'కు

# ప్రాధాన్యం

రాబోయే 20 ఏళ్ల నిర్ణయాలకు ఇదే ప్రాతిపదిక కావాలి

ఫిక్కీ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ



4

## ఎన్నికల సవాళ్లను ఎదుర్కొంటూ పోరాడతాం

ఎన్నికల సవాళ్లను ఎదుర్కొంటూ పోరాడతాం

లోపాల పేరుతో పోటీకి దూరమైతే ప్రజాస్వామ్యానికి ముప్పు

చికాగో విశ్వవిద్యాలయం కార్యక్రమంలో రాహుల్ గాంధీ



4

# మూడో విడత పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్

- ఈ నెల 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ
- 24న పరిశీలన.. 27న ఉపసంహరణకు గడువు
- డిసెంబర్ 2న పోలింగ్.. అదే రోజు ఫలితాలు, ఉపసర్పంచ్ ఎన్నిక
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

వివరాలు 3లో..





2

## సీబీఐ, ఈడీ విచారణ జరపాలి

జనసేన ఆఫీసులో రూ.7 కోట్ల మోసం

పవన్ తక్షణమే వివరణ ఇవ్వాలి

వైసీపీ నేత నాగార్జున యాదవ్

# జగన్ కేసులపై స్టేటస్ రిపోర్టు ఇవ్వండి

- అక్రమాస్తుల కేసుల విచారణ వేగవంతంపై హైకోర్టులో వాదనలు
- 15 ఏళ్లలో 150కి పైగా డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలయ్యాయన్న ఈడీ
- రోజువారీ విచారణ చేపట్టాలని హరిరామజోగయ్య తరఫు న్యాయవాది వినతి
- తదుపరి విచారణ నవంబర్ 30కి వాయిదా

2





# జర్నలిస్టుల హౌసింగ్ త్వరలో పూర్తి చేద్దాం

**అమరావతి ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు సానుకూల స్పందన**

**వెంటనే సమావేశం నిర్వహిస్తామన్న సీఎం కార్యదర్శి ప్రద్యుమ్న**

**అమరావతి, నవంబర్ 19 (సమయం న్యూస్):** అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారు. అమరావతి జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి పాటిబండ్ల నాగశ్రీనివాసరావు గురువారం సాయంత్రం ఉండవల్లిలోని నివాసంలో సీఎంను కలిసి హౌసింగ్ ప్రాజెక్టుపై చర్చించారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను ముఖ్యమంత్రికి అందజేశారు. దీనిపై స్పందించిన చంద్రబాబు.. ఈ అంశాన్ని త్వరలోనే పూర్తి చేద్దామని చెప్పారు. అక్కడే ఉన్న ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లగా, ప్రభుత్వం వెంటనే దీనిపై సమావేశం నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నాగశ్రీనివాసరావు ఇతర ముఖ్య అధికారులను కూడా కలిశారు.

# జనసేనలో చేరిన అనంత శ్రీరామ్ తల్లిదండ్రులు

**దొడ్డిపట్ల సర్పంచ్ అభ్యర్థిగా తల్లి ఉమారాణి**

**పవన్ విజన్‌కు ఆకర్షితులయ్యారన్న అనంత శ్రీరామ్**

**భీమవరంలో కండువా కప్పి ఆహ్వానించిన గోవిందరావు**

**భీమవరం, నవంబర్ 19 (సమయం న్యూస్) :** ప్రముఖ సినీ గీత రచయిత అనంత శ్రీరామ్ కుటుంబం రాజకీయాల్లోకి అడుగుపెట్టింది. ఆయన తల్లిదండ్రులు చేగొండి వీర వెంకట సత్యనారాయణమూర్తి, చేగొండి ఉమారాణి గురువారం అధికారికంగా జనసేన పార్టీలో చేరారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని జనసేన జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె. గోవిందరావు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకొల్లు నియోజకవర్గంలోని యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ఉమారాణి పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా అనంత శ్రీరామ్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధ, తీసుకుంటున్న చర్యలు తమను ఎంతగానో ప్రభావితం చేశాయని తెలిపారు. పల్లెల ప్రగతే ధ్యేయంగా ఆయన చేస్తున్న పనులకు ఆకర్షితులై తన తల్లిదండ్రులు జనసేనలో చేరారని స్పష్టం చేశారు. పవన్ కల్యాణ్ పనితీరు, గ్రామాల పట్ల ఆయనకున్న విజన్‌ను ఉమారాణి కొనియాడారు. ప్రజలకు మరింత చేరువై సేవ చేసేందుకే జనసేనతో కలిసి నడవాలని నిర్ణయించుకున్నట్లు ఆమె పేర్కొన్నారు.

# ఈడీ ఛార్జిషీట్‌పై జగన్ జవాబు చెప్పాలి

**క్విడ్ ప్రో కో వ్యవహారాలు మరోసారి బహిర్గతం**

**13 ఏళ్లుగా వాయిదాలతో విచారణలో జాప్యం**

**టీడీపీ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు**

**మంగళగిరి, నవంబర్ 19 (సమయం న్యూస్):** వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ తనపై ఉన్న అక్రమాస్తుల ఆరోపణలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన ఛార్జిషీట్‌పై తక్షణమే ప్రజలకు సమాధానం చెప్పాలని టీడీపీ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేసే జగన్, తనపై ఈడీ నమోదు చేసిన అభియోగాలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

ఈడీ ఛార్జిషీట్ల ద్వారా జగన్ క్విడ్ ప్రో కో వ్యవహారాలు మరోసారి బహిర్గతమయ్యాయని బోండా ఉమా ఆరోపించారు. 2008 జనవరిలో వైఎస్సార్ కడప జిల్లా మైలవరం మండలం తలమంచిపట్నంలో 407 హెక్టార్ల సున్నపురాయి గనులను సజ్జల కుటుంబానికి చెందిన ఈశ్వర్ సిమెంట్స్‌కు మంజూరు చేసి, ఆ తర్వాత జీవో నెం.321 ద్వారా దాల్మియా సిమెంట్స్‌కు బదలాయించారని పేర్కొన్నారు. ఈ లీజుల కేటాయింపులో క్విడ్ ప్రో కో జరిగినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించి జగన్‌ను ఏ1 నిందితుడిగా చేర్చాయని తెలిపారు. 2010లో దాల్మియా సిమెంట్స్ షేర్లను విదేశీ కంపెనీకి విక్రయించగా వచ్చిన రూ.139 కోట్లను జగన్ తన సంస్థలకు మళ్లించారని ఈడీ ఛార్జిషీట్‌లో పేర్కొన్నట్లు చెప్పారు. రూ.55 కోట్లు హవాలా రూపంలో చేరాయని, ఈశ్వర్ సిమెంట్స్‌కు రూ.2.14 కోట్ల మేర మనీలాండరింగ్ జరిగిందని దర్యాప్తు సంస్థలు వెల్లడించాయని తెలిపారు.



గత 13 ఏళ్లుగా జగన్ బెయిల్‌పై ఉంటూ 141 డిశ్చార్జ్ పిటిషన్లు, 3,400కు పైగా వాయిదాలతో విచారణను ఆలస్యం చేస్తున్నారని బోండా ఉమా విమర్శించారు. జగన్ వ్యక్తిగత సహాయకుడి పేరిట విదేశాల్లో భారీ ఆర్థిక లావాదేవీలు నడిచాయని ఆరోపించారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సునీతా రెడ్డి లేవనెత్తుతున్న అంశాలకు, ఆస్తుల పంపకాలపై సొంత కుటుంబ సభ్యులు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా వైసీపీ నేతలు దాటవేస్తున్నారని వ్యాఖ్యానించారు.

# మూడు ఆర్థిక ఇంజిన్లు.. పెట్టుబడుల వెల్లువ!

- బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా మారిన అక్వాన్
- నరసాపురం-పూరీ, నెల్లూరు-విశాఖ మధ్య తీరం దాటే ఛాన్స్
- తీరం దాటే సమయంలో గంటకు 145 కి.మీ వేగంతో పెనుగాలులు
- కోస్తా జిల్లాల్లో రెండు రోజుల పాటు అత్యంత భారీ వర్షాలు
- రంగంలోకి 13 ఎన్డీఆర్ఎఫ్, 11 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు

(మొదటి పేజీ తరువాయి..)

ఐటీ, డేటా సెంటర్లు, భారీ పరిశ్రమలకు; రాయలసీమలో సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, గ్రీన్ ఎనర్జీకి; అమరావతిలో క్వాంటం టెక్నాలజీ, ఐటీ, లాజిస్టిక్స్, పోర్టు ఆధారిత పరిశ్రమలు, అగ్రి వాల్యూ చైన్ రంగాలకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించారు.

**విశాఖలో 'బే సిటీ'.. 2 లక్షల ఉద్యోగాలు**

విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలో 167 అభివృద్ధి పనులకు ప్రణాళికలు వేయగా, ఇప్పటికే 64 పనులు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంతానికి యాంకర్ ప్రాజెక్టుగా 'వైజాగ్ బే సిటీ'ని అభివృద్ధి చేయనున్నారు. మధురవాడ, కాపులుప్పాడ, ఆనందపురం



ప్రాంతాల్లో ఐటీ, డేటా సెంటర్ హబ్‌లు ఏర్పాటు చేసి 15 నుంచి 20 కొత్త ఐటీ సంస్థలను ఆకర్షించనున్నారు. వీటితో పాటు ఇప్పటికే ఉన్న సంస్థల ద్వారా 2 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. విశాఖలో స్టీల్ సిటీ, కాకినాడలో ఇండస్ట్రియల్ సిటీ, పోర్టుల విస్తరణకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. తీర ప్రాంత అభివృద్ధితో పాటు కోనసీమ బ్యాక్‌వాటర్స్, అరకు, మారేడుమిల్లిలో ఎకో టూరిజం ప్రాజెక్టులపైనా ప్రత్యేక దృష్టి సారించారు.

**తిరుపతిలో 14 పారిశ్రామిక నగరాలు**

తిరుపతి ఎకనమిక్ రీజియన్‌లో అగ్రి ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, స్పేస్, ఎయిర్‌క్రాఫ్ట్, ఆటోమొబైల్, ఈవీ, డిఫెన్స్, టూరిజం, నాలెడ్జ్ రంగాలను అభివృద్ధి చేయనున్నారు. రాష్ట్రంలోని 87 గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో 66 ప్రాజెక్టుల పెట్టుబడులు ఈ రీజియన్ పరిధిలోకే రావడం విశేషం. హార్టికల్చర్ హబ్‌లో భాగంగా డెయిరీ, మీట్ అండ్ పౌల్ట్రీ, ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్లు, టెర్మినల్ మార్కెట్ల క్లస్టర్లను ఏర్పాటు చేస్తారు. ఈ రీజియన్‌లోని 14 పట్టణాలను రంగాల వారీగా పారిశ్రామిక నగరాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు రూపొందించారు.

**అమరావతిలో రూ.4.65 లక్షల కోట్ల గ్రౌండింగ్**

అమరావతి ఆర్థిక ప్రాంతంలో 48 ప్రధాన ప్రాజెక్టుల ద్వారా రూ.4.65 లక్షల కోట్ల పెట్టుబడులను గ్రౌండింగ్ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల నిర్మాణాన్ని పూర్తి చేసి ఎగుమతులు, పారిశ్రామిక అభివృద్ధి, లాజిస్టిక్స్ రంగాలకు కొత్త ఊతమివ్వనున్నారు. కోస్టల్ టూరిజం కింద సూర్యలంక, ఓడరేవు, రామాపురం, చినగంజాం, నిజాంపట్నం, దిండి ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నారు. మూడు రీజియన్లలో రంగాల వారీగా పెట్టుబడులను ఆకర్షించి, పరిశ్రమల స్థాపనను వేగవంతం చేయడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

# స్థానిక ఎన్నికల్లో కూటమి గెలుపే లక్ష్యం

- 2024 కంటే ఎక్కువ ఓట్ల శాతం సాధించాలి
- పొత్తు ధర్మానికి కట్టుబడి సమష్టిగా పనిచేయాలి
- ఒక్క వార్డులో ఓడినా కారణాలు విశ్లేషిస్తా
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**అమరావతి, నవంబర్ 19 (సమయం న్యూస్):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పంచాయతీ ఎన్నికలు, రెండో దశ పట్టణ ఎన్నికల నేపథ్యంలో టీడీపీ నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన ఎన్నికల వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. 2024 ఎన్నికల్లో కూటమికి వచ్చిన ఓట్ల శాతం కంటే ఈసారి గణనీయంగా ఎక్కువ ఓట్లు సాధించాలని సూచించారు. కూటమి బలాన్ని నిరూపించుకోవడానికి స్థానిక ఎన్నికలు మంచి అవకాశమని పేర్కొన్నారు. కూటమి పార్టీల మధ్య ఐక్యత శాశ్వతంగా ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ పొత్తు ధర్మానికి కట్టుబడి, కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ప్రతి ఎన్నికలోనూ గెలుపే లక్ష్యంగా పెట్టుకోవాలని, ఏ ఒక్క వార్డులో ఓటమి ఎదురైనా అందుకు గల కారణాలను విశ్లేషిస్తానని తెలిపారు. గ్రామాలు, నియోజకవర్గాల్లో నాయకుల మధ్య ఉన్న ఐక్యతను పరిశీలించి, దానికి అనుగుణంగా తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. రాజకీయ ముసుగులో వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యవహరించే వారికి ప్రజలే తగిన సమాధానం చెప్పేలా వాస్తవాలను వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

# ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోబోటిక్ శస్త్రచికిత్సలు!

**రూ.1,011 కోట్లతో అత్యాధునిక వైద్య సేవలకు ప్రతిపాదనలు**

**తొలిదశలో విజయవాడ.. ఆపై విశాఖ, కర్నూలులో ఏర్పాటు**

**రాష్ట్రంలో తొలిసారిగా 5 ప్రభుత్వ సంతాన సాఫల్య కేంద్రాలు**

**వైద్యారోగ్య శాఖ సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్**



**గుంటూరు, నవంబర్ 19 (సమయం న్యూస్) :** ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు వైద్యారోగ్య శాఖ భారీ కసరత్తు చేస్తోంది. రోబోటిక్ శస్త్రచికిత్సలు, ఐవీఎఫ్, బోన్ మేరో ట్రాన్స్‌ప్లాంట్ సహా పలు ఆధునిక సేవల విస్తరణకు రూ.1,011 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. తొలిదశలో విజయవాడ ప్రభుత్వ బోధనాసుపత్రిలో రూ.45 కోట్లతో రోబోటిక్ శస్త్రచికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేసి, మలివిడతలో విశాఖ కేజీహెచ్, కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల్లోనూ ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. మంగళగిరిలోని వైద్యారోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో గురువారం నాలుగు గంటల పాటు జరిగిన విస్తృతస్థాయి సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులతో చర్చించారు. బోధనాసుపత్రుల్లో ప్రత్యేక చికిత్సా కేంద్రాలు, వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూపొందించిన ప్రతిపాదనలను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువర్ధన్ మంత్రికి వివరించారు.

**కీలక ప్రతిపాదనలు ఇవే..**

ప్రభుత్వ ఆస్పత్రుల్లో తొలిసారిగా గుంటూరు, అనంతపురం, విజయనగరం, కాకినాడ, తిరుపతి బోధనాసుపత్రుల్లో రూ.17.50 కోట్లతో ఐదు సంతాన సాఫల్య కేంద్రాలను (ఐవీఎఫ్) నెలకొల్పాలని ప్రతిపాదించారు. విజయవాడ బోధనాసుపత్రిలో రూ.17 కోట్లతో అరుదైన వ్యాధుల చికిత్సకు ప్రత్యేక అత్యుత్తమ వైద్య కేంద్రం, పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంతో పాటు 11 పాత ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో రూ.163.52 కోట్లతో అవయవ మార్పిడి కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు వేశారు. విశాఖపట్నం, గుంటూరు, కర్నూలు బోధనాసుపత్రుల్లో రూ.48 కోట్లతో బోన్ మేరో ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రాలను ప్రతిపాదించారు. వీటితో పాటు వృద్ధుల వైద్య కేంద్రం, క్లినికల్ స్కిల్స్ అండ్ సిమ్యులేషన్, ఇంటర్వెన్షనల్ న్యూరో రేడియాలజీ, స్పీచ్ అండ్ హియరింగ్ ఈఎన్‌టీ, సమగ్ర క్యాన్సర్ వైద్య కేంద్రాల ఏర్పాటుపైనా డీఎంఈ వివరించారు. రూ.180 కోట్లతో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ పబ్లిక్ హెల్త్ ఏర్పాటు, రూ.65 కోట్లతో ఐసీయూల బలోపేతం ప్రతిపాదనలను మంత్రి ముందుంచారు. వీటిపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

**వెంటిలేటర్ల విషయంలో రాజీ వద్దు**

రోగుల అవసరాలకు అనుగుణంగా ఐసీయూ పడకలు, వెంటిలేటర్లు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం ప్రతిపాదించిన 850 వెంటిలేటర్లకు అదనంగా ఇంకా ఎన్ని అవసరమో క్షేత్రస్థాయిలో గుర్తించాలని సూచించారు. రోగుల ప్రాణాల విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ ఆర్. వెంకటరమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సీబీఐ, ఈడీ విచారణ జరపాలి

**జనసేన ఆఫీసులో రూ.7 కోట్ల మోసం.. పవన్ తక్షణమే వివరణ ఇవ్వాలి**

**ఆఫీసు సీసీటీవీ ఫుటేజీ సీజ్ చేయాలి.. వైసీపీ నేత నాగార్జున యాదవ్**

**అమరావతి, నవంబర్ 19 (సమయం న్యూస్):** జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వేదికగా ప్రభుత్వ ఉద్యోగాల పేరిట పెద్ద ఎత్తున మోసం జరిగిందని వైసీపీ ఆరోపించింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సిట్ లేదా సీఐడీ కాకుండా, కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. గురువారం వైసీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ పార్టీ అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ మాట్లాడారు. ఈ పరిణామాలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రజలకు తక్షణమే వివరణ ఇవ్వాలని ఆయన కోరారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల డిజిటల్ సంతకాలు, ప్రభుత్వ చిహ్నాలు, నకిలీ నియామక పత్రాలను ఉపయోగించి 36 మంది నిరుద్యోగుల నుంచి రూ.7 కోట్లు వసూలు చేశారని నాగార్జున యాదవ్ ఆరోపించారు. ఈ కుంభకోణం విస్తృతి దాదాపు రూ.700 కోట్లకు పైగా ఉండే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న జనసేన నేత కోట రుక్మిణి సోషల్ మీడియా ద్వారా స్పందించారని, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్ మీడియా సమావేశం నిర్వహించినప్పటికీ, నవంబర్ 11న ఈ విషయం వెలుగులోకి వచ్చినప్పటి నుంచి పవన్ కల్యాణ్ మౌనంగా ఉన్నారని విమర్శించారు. నిరుద్యోగుల నుంచి వసూలు చేసిన రూ.7 కోట్లు ఎక్కడికి వెళ్లాయో రుక్మిణి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.


**సీసీటీవీ ఫుటేజీని స్వాధీనం చేసుకోవాలి**

జనసేనలో ఉన్న 'కట్టప్పల' గురించి కళ్యాణం శివ శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీలోని అంతర్గత విభేదాలను ప్రతిబింబిస్తున్నాయని, ఆయన ఎవరిని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేశారో స్పష్టత ఇవ్వాలని నాగార్జున యాదవ్ అన్నారు. రుక్మిణి కంపెనీలో హెచ్ఆర్‌గా పనిచేసిన ధరణి అనే మహిళను ఈ కేసులో బలిపశువును చేశారని, పోలీసుల విచారణ పేరిట ఆమెను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. ఏపీపీఎస్సీ డేటాబేస్ మార్పులపై ఆమె చేసిన వ్యాఖ్యలపై, అలాగే అటవీ శాఖలో 780 పోస్టుల భర్తీ ప్రక్రియ ఆగిపోవడానికి ఈ వ్యవహారంతో ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో విచారణ చేపట్టాలని కోరారు. రుక్మిణికి చెందిన లండన్ కంపెనీకి చెల్లింపులు జరిగినట్లు కొన్ని బ్యాంక్ రశీదుల ద్వారా తెలుస్తోందని పేర్కొంటూ, జనసేన పార్టీ కార్యాలయం సీసీటీవీ ఫుటేజీని వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిధులను పార్టీ కార్యాలయ నిర్వహణకు లేదా పవన్ కల్యాణ్ సినిమాలకు సంబంధించిన అంశాలకు మళ్లించారా అనే ఆరోపణలపైనా పూర్తిస్థాయి విచారణ అవసరమని ఆయన పేర్కొన్నారు.



# రానున్న 36 గంటలు కీలకం

- తీరాన్ని వణికిస్తున్న 'అక్వాన్'!
- నేటి మధ్యాహ్నం గోపాల్‌పూర్ వద్ద తీరం దాటే అవకాశం
- ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు.. 80 కి.మీ. వేగంతో గాలులు
- ముందస్తుగా 39 రైళ్లు రద్దు.. విమాన సర్వీసులపై ప్రభావం
- అల్లకల్లోలంగా సముద్రం.. వేటకు వెళ్లొద్దని హెచ్చరిక
- ఒడిశాలో లక్ష మందికి పైగా సురక్షిత ప్రాంతాలకు తరలింపు



ప్రభావంతో రానున్న 24 నుంచి 36 గంటలు అత్యంత కీలకంగా మారనున్నాయి.

**అమరావతి, నవంబర్ 19 (సమయం న్యూస్):** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన 'అక్వాన్' తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్, ఒడిశా తీరాల వైపు వేగంగా దూసుకొస్తోంది. గత ఆరు గంటల్లో గంటకు 12 కిలోమీటర్ల వేగంతో కదులుతున్న ఈ తుపాను ప్రస్తుతం నరసాపురం, కళింగపట్నానికి 440 కిలోమీటర్లు, గోపాల్‌పూర్‌కు 530 కిలోమీటర్లు, పూరీకి 590 కిలోమీటర్లు, చెన్నైకి 580 కిలోమీటర్ల దూరంలో ఉంది. శుక్రవారం మధ్యాహ్నానికి నరసాపురంఉపూరీ మధ్య ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ, ఆర్టీజీఎస్ అధికారులు అంచనా వేస్తున్నారు. తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు, పలు ప్రాంతాల్లో విస్తారంగా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ సహా తీరప్రాంత జిల్లాలపై ప్రభావం ఎక్కువగా ఉండనుంది. తీరం వెంబడి గంటకు 60 నుంచి 70 కిలోమీటర్లు, గరిష్ఠంగా 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరించారు. ఇప్పటికే మచిలీపట్నం సహా ఆంధ్రప్రదేశ్, ఒడిశా తీర ప్రాంతాల్లో సముద్రం అల్లకల్లోలంగా మారింది.

### భారీ వర్షాలు.. బలమైన ఈదురుగాలులు

### రైళ్ల రద్దు.. విమాన రాకపోకలకు అంతరాయం

అక్వాన్ తుపాను హెచ్చరికల నేపథ్యంలో రవాణా వ్యవస్థపై ప్రభావం పడింది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా రైల్వే శాఖ ముందస్తుగా వందే భారత్ సహా 39 రైళ్లను రద్దు చేయగా, మరో 28 రైళ్ల రాకపోకల్లో మార్పులు చేసింది. తూర్పు కోస్తా రైల్వే పరిధిలో పలు రైళ్ల సమయాలను రీషెడ్యూల్ చేశారు. మరోవైపు ప్రతికూల వాతావరణం కారణంగా విశాఖపట్నం, భువనేశ్వర్, కోల్‌కతా విమానాశ్రయాల నుంచి నడిచే విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడినట్లు ఇండిగో సంస్థ ప్రకటించింది.

### ఒడిశాలో లక్ష మంది తరలింపు

తుపాను ప్రభావిత, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీఎస్‌డీఎంఏ ఎండీ, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ సూచించారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సముద్రంలో వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. తుపాను కదలికలను రాష్ట్ర అత్యవసర కార్యకలాపాల కేంద్రం ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని, చెరువులు, జలాశయాలు, లోతట్టు ప్రాంతాలపై జిల్లా యంత్రాంగాలు నిరంతర నిఘా ఉంచాయని తెలిపారు. ప్రజలు వదంతులను నమ్మకుండా అధికారిక సూచనలు పాటించాలని కోరారు. మరోవైపు తుపాను ముప్పు పొంచి ఉన్న ఒడిశాలో ప్రభుత్వం లక్ష మందికి పైగా ప్రజలను సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించి, ఎన్డీఆర్ఎఫ్‌తో పాటు 305 ప్రత్యేక సహాయక బృందాలను రంగంలోకి దించింది.

# మూడో విడత పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్

- ఈ నెల 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ
- 24న పరిశీలన.. 27న ఉపసంహరణకు గడువు
- డిసెంబర్ 2న పోలింగ్.. అదే రోజు ఫలితాలు, ఉపసర్పంచ్ ఎన్నిక
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా



అనుబంధంఉ××లో పొందుపరిచినట్లు ఆయన తెలిపారు.

**విజయవాడ, నవంబర్ 19 (సమయం న్యూస్):** రాష్ట్రంలో రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మూడో విడత ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ విడతలో 25 జిల్లాలకు చెందిన వివిధ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని మండలాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహించనున్నారు. మూడో విడత ఎన్నికలు జరిగే మండలాల వివరాలను నోటిఫికేషన్‌కు జతచేసిన

### ఎన్నికల షెడ్యూల్ ఇలా..

షెడ్యూల్ ప్రకారం నవంబర్ 21న సంబంధిత రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటీసులు జారీ చేసి, అదే రోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. నవంబర్ 23 సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుంది. నవంబర్ 24న ఉదయం 8 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన, 25న తిరస్కరణలపై అప్పీళ్ల స్వీకరణ, 26న అప్పీళ్ల పరిష్కారం ఉంటాయి. నవంబర్ 27 మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.

అవసరమైన గ్రామ పంచాయతీల్లో డిసెంబర్ 2న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, పూర్తయిన వెంటనే ఫలితాలు వెల్లడిస్తారు. ఫలితాలు ప్రకటించిన రోజే ఉపసర్పంచ్ ఎన్నికను పూర్తి చేస్తారు. ఏదైనా కారణంతో ఆ రోజు సాధ్యం కాకపోతే మరుసటి రోజు నిర్వహిస్తారు. రీపోలింగ్ అవసరమైతే డిసెంబర్ 3న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు. రీపోలింగ్ జరిగిన పంచాయతీల్లో ఫలితాల తర్వాతే ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తారు.

# గెలిచిందెవరు.. ఓడిందెవరు?

### రెడ్ బుక్ పార్టీనా.. రప్పా రప్పా పార్టీనా?

### ఈసీ-పోలీసులా.. ప్రజలుఉప్రజాస్వామ్యమా?

### స్థానిక ఎన్నికలపై 'ఎక్స్'లో విజయసాయిరెడ్డి పోల్

### కొలనుకొండలో పీఆర్‌పీ రాష్ట్ర కేంద్ర కార్యాలయం

**అమరావతి, నవంబర్ 19 (సమయం న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల పరిణామాలపై మాజీ ఎంపీ, పరివర్తన రాజనీతి పార్టీ (పీఆర్‌పీ) అధినేత విజయసాయిరెడ్డి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఈ ఎన్నికల్లో గెలుపోటములపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే ఉద్దేశంతో ఆయన తన 'ఎక్స్' ఖాతాలో ఒక క్విజ్ పోస్ట్ చేశారు. "నా ప్రియమైన రాష్ట్ర ప్రజలారా.. మీకు ఒక క్విజ్! రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక ఎన్నికల్లో గెలిచిందెవరు? ఓడిందెవరు? కింద ఇచ్చిన నాలుగు ఆప్షన్లలో మీ ఓటు ఎవరికి వేస్తారో దయచేసి దానిపై క్లిక్ చేయండి" అని తన పోస్టులో పేర్కొన్నారు. ఇందులో మొదటి ఆప్షన్‌గా 'రెడ్ బుక్ పార్టీనా', రెండో ఆప్షన్‌గా 'రప్పా రప్పా పార్టీనా', మూడో ఆప్షన్‌గా 'ఎన్నికల కమిషన్ఉపోలీసులా', నాలుగో ఆప్షన్‌గా 'ప్రజలుఉ ప్రజాస్వామ్యమా' అని ఇస్తూ నెటిజన్ల అభిప్రాయాలను కోరారు.



### కొలనుకొండలో పీఆర్‌పీ రాష్ట్ర కేంద్ర కార్యాలయం

మరోవైపు తాను ఇటీవల స్థాపించిన పరివర్తన రాజనీతి పార్టీ రాష్ట్ర కేంద్ర కార్యాలయానికి సంబంధించిన గూగుల్ లొకేషన్ లింక్‌ను విజయసాయిరెడ్డి తన 'ఎక్స్' ఖాతా ద్వారా పంచుకున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి సమీపంలోని కొలనుకొండలో ఈ ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలు సులభంగా చేరుకునేందుకు వీలుగా మ్యాప్ లింక్‌ను బహిర్గతం చేస్తూ, పార్టీ కార్యకలాపాలకు ఇది కేంద్ర బిందువుగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. నవంబర్ 11న విజయవాడ వేదికగా నూతన పార్టీని ప్రకటించిన ఆయన, రాజకీయాల్లో సమూల మార్పుల లక్ష్యంగా కార్యాచరణను వేగవంతం చేశారు. పార్టీ సిద్ధాంతాలు, సభ్యత్వ నమోదు, భవిష్యత్ కార్యాచరణ, అధికారిక ప్రకటనల కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. త్వరలోనే కేంద్ర కార్యాలయం వేదికగా పార్టీ విస్తరణ, కమిటీల ఏర్పాటు తదితర కీలక కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి.

# షర్మిలపై తప్పుడు ప్రచారాలు కలచివేస్తున్నాయి

### చంద్రబాబుకు శుభలేఖ ఇవ్వడం సంస్కారమే

### రాజకీయ లబ్ధి కోసం సొంతవారే బురదజల్లుతున్నారు

### కుటుంబ బంధాలను రాజకీయాలకు బలి చేయొద్దు

### వైఎస్ విజయమ్మ పేరుతో బహిరంగ లేఖ

**హైదరాబాద్, నవంబర్ 19 (సమయం న్యూస్):** వైఎస్ షర్మిలకు జరుగుతున్న అన్యాయం, ఆమెపై సాగుతున్న తప్పుడు ప్రచారాలు ఒక తల్లిగా తన మనసును తీవ్రంగా కలచివేస్తున్నాయని వైఎస్ విజయమ్మ పేరుతో విడుదలైన బహిరంగ లేఖలో ఆవేదన వ్యక్తమైంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ లేఖ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి బతికి ఉంటే తన బిడ్డ షర్మిలపై జరుగుతున్న ఈ పరిణామాలను చూసి ఎంతో బాధపడేవారని అందులో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు తన కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను అందించడంలో ఎలాంటి తప్పు లేదని ఆ లేఖలో సమర్థించారు. వైఎస్సార్, చంద్రబాబు మధ్య రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ, దాదాపు 50 ఏళ్ల క్రితమే వారిద్దరి మధ్య వ్యక్తిగత స్నేహం ఉండేదని గుర్తుచేశారు. తండ్రి వయసున్న వ్యక్తికి, తండ్రి మిత్రుడికి వెళ్లి శుభలేఖ ఇవ్వడం సంస్కారమని పేర్కొన్నారు. రాజకీయాలు వేరు, మానవ సంబంధాలు వేరు అని వైఎస్సార్ బలంగా నమ్మేవారని, రాజకీయ ప్రత్యర్థులతోనూ గౌరవప్రదమైన సంబంధాలను కొనసాగించిన చరిత్ర ఆయనదని వివరించారు.

రాజకీయ లబ్ధి కోసం సొంతవారే తప్పుడు రాతలు రాస్తూ వ్యక్తిత్వంపై బురదజల్లుతుండటం అత్యంత బాధాకరమని లేఖలో విమర్శించారు. షర్మిలను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేకనే వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని ఆరోపించారు. గతంలో ఆమె చేసిన పాదయాత్రలు, పడిన కష్టాలు, ఎదుర్కొన్న ఇబ్బందులు సామాన్యమైనవి కావని, వైఎస్సార్ జీవించి ఉన్నప్పుడు ఎన్నడూ ఇలాంటి దిగజారుడు రాజకీయాలను ప్రోత్సహించలేదని తెలిపారు. వైఎస్ కుటుంబ వారసత్వం అంటే కేవలం పదవులు, ఆస్తులు మాత్రమే కాదని, ప్రజల పట్ల ప్రేమ, మాట తప్పని నైజం, కష్టాల్లో ఉన్నవారికి తోడుగా నిలబడటమే అసలైన వారసత్వమని స్పష్టం చేశారు. షర్మిలలో రాజశేఖర్ రెడ్డి ఆలోచనా విధానం, అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం, పోరాట పటిమ స్పష్టంగా కనిపిస్తాయని ప్రశంసించారు. ఎన్ని అవమానాలు, కష్టాలు ఎదురైనా చిరునవ్వుతో ఎదుర్కొనే శక్తి ఆమెకు ఉందని, ఈ తప్పుడు ప్రచారాలు ఆమెను బలహీనపరచలేవని భరోసా ఇచ్చారు. రాజకీయ ప్రత్యర్థులను రాజకీయంగానే ఎదుర్కోవాలని, కుటుంబ బంధాలను, మహిళల ఆత్మగౌరవాన్ని రాజకీయాలకు బలి చేయవద్దని హితవు పలికారు. వైఎస్సార్ ఆశయాలు, విలువల గురించి మాట్లాడే ప్రతి ఒక్కరూ ఆత్మపరిశీలన చేసుకోవాలని, షర్మిల త్యాగాలను, పడిన కష్టాన్ని ఎవరూ మరచిపోకూడదని ఆ లేఖలో పిలుపునిచ్చారు.

# 600 మండలాల్లో ఎంపీపీ ఎన్నికలు పూర్తి

### 59 చోట్ల పెండింగ్.. నేడు ఉదయం 11 గంటలకు నిర్వహణ

### 34 అధ్యక్ష, 59 ఉపాధ్యక్ష పదవులకు జరగనున్న ఎన్నికలు

### రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

**విజయవాడ, నవంబర్ 19 (సమయం న్యూస్):** రాష్ట్రంలోని మొత్తం 659 మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ)లకు గాను 600 చోట్ల అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల పరోక్ష ఎన్నికల ప్రక్రియ పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. గురువారం నాటికి అందిన సమాచారం మేరకు మిగిలిన 59 మండల ప్రజా పరిషత్‌లలో ఎన్నికలు పూర్తికావాల్సి ఉందని వెల్లడించారు. వీటిలో 34 చోట్ల అధ్యక్ష, 59 చోట్ల ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఈ ఎన్నికలను శుక్రవారం (నవంబర్ 20) ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఎన్నికల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు.

### ఎన్నికలు జరగని మండల ప్రజా పరిషత్‌లు ఇవే..

శ్రీకాకుళం జిల్లాలో గార, శ్రీకాకుళం; విజయనగరం జిల్లాలో భోగాపురం, పూసపాటిరేగ, మెంటాడ, చీపురుపల్లి; అనకాపల్లి జిల్లాలో బుచ్చయ్యపేట, చోడవరం, రావికమతం, రోలుగుంట; అల్లూరి సీతారామరాజు జిల్లాలో డుంబ్రిగూడ, అరకు; పోలవరం జిల్లాలో అడ్డతీగల, గంగవరం ఏజెన్సీ; కాకినాడ జిల్లాలో యు.కొత్తపల్లి; ఏలూరు జిల్లాలో పెదపాడు, లింగపాలెం; కృష్ణా జిల్లాలో మచిలీపట్నం సౌత్, మచిలీపట్నం నార్త్, గూడూరు, నాగాయలంక; పల్నాడు జిల్లాలో అచ్చంపేట, రొంపిచర్ల, వినుకొండ; బాపట్ల జిల్లాలో బాపట్ల; ప్రకాశం జిల్లాలో కొత్తపట్నం; మార్కాపురం జిల్లాలో వెలిగండ్ల, హెచ్.ఎం.పాడు, కనిగిరి, పి.సి.పల్లె మండలాల్లో ఎన్నికలు పెండింగ్‌లో ఉన్నాయి.

అలాగే తిరుపతి జిల్లాలో వాకాడు, ఓజిలి, వెంకటగిరి, నాగులాపురం, తొట్టంబేడు, పిచ్చాటూరు; అన్నమయ్య జిల్లాలో ములకలచెరువు; వైఎస్ఆర్ కడప జిల్లాలో అట్లూరు, బద్వేల్, చాపాడు, గోపవరం, పోరుమామిళ్ల, బి.కోడూరు, పులివెందుల, సింహాద్రిపురం, వీరబల్లి; అనంతపురం జిల్లాలో కుడేరు, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, బెలుగుప్ప, పామిడి, కల్యాణదుర్గం; శ్రీ సత్యసాయి జిల్లాలో ముదిగుబ్బ; కర్నూలు జిల్లాలో సి.బెళగల్, గూడూరు, మంత్రాలయం; నంద్యాల జిల్లాలో పగిడ్యాల, ఉయ్యాలవాడ మండల ప్రజా పరిషత్‌లలో నేడు ఎన్నికలు జరగాల్సి ఉంది.

# ఐదు మండలాల్లో లక్కీ డ్రా.. నాలుగు టీడీపీకే

### ఎంపీపీ ఎన్నికల్లో బలాబలాలు సమానం కావడంతో లాటరీ

### గుర్ల సహా నాలుగు చోట్ల టీడీపీ అభ్యర్థుల విజయం

### మునగపాక ఎంపీపీ పీఠం దక్కించుకున్న వైసీపీ

**అమరావతి, నవంబర్ 19 (సమయం న్యూస్) :** రాష్ట్రవ్యాప్తంగా గురువారం జరిగిన మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ) ఎన్నికల్లో ఐదు మండలాల్లో టీడీపీ, వైసీపీ బలాబలాలు సమానంగా నిలిచాయి. టై ఏర్పడటంతో ఎన్నికల నిబంధనల ప్రకారం అధికారులు లాటరీ (లక్కీ డ్రా) నిర్వహించి విజేతలను ప్రకటించారు. ఈ ఐదు స్థానాల్లో టీడీపీ నాలుగు చోట్ల గెలుపొందగా, వైసీపీ ఒక స్థానాన్ని దక్కించుకుంది. విజయనగరం జిల్లా గుర్ల ఎంపీపీ ఎన్నిక తీవ్ర ఉత్కంఠ నడుమ ముగిసింది. ఇరు పార్టీల సభ్యుల బలం సమానం కావడంతో నిర్వహించిన లక్కీ డ్రాలో టీడీపీ అభ్యర్థి సన్యాసినాయుడు విజయం సాధించారు. అలాగే నెల్లూరు జిల్లా సైదాపురం మండలంలో పొట్టేళ్ల పార్వతి (టీడీపీ), శ్రీ సత్యసాయి జిల్లా ఓబులదేవర చెరువు మండలంలో పిట్టా ఓబులరెడ్డి (టీడీపీ), కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలంలో సుజిత (టీడీపీ) లాటరీ ద్వారా ఎంపీపీ పీఠాలను కైవసం చేసుకున్నారు. అనకాపల్లి జిల్లా మునగపాక మండలంలో నిర్వహించిన లక్కీ డ్రాలో వైసీపీ అభ్యర్థి మొల్లేటి శంకర్ విజేతగా నిలిచారు. ఈ ఐదు మండలాల్లో లాటరీ ప్రక్రియను అధికారులు పూర్తి పారదర్శకంగా నిర్వహించి ఫలితాలను వెల్లడించారు.

# జగన్ కేసులపై స్టేటస్ రిపోర్టు ఇవ్వండి

### అక్రమాస్తుల కేసుల విచారణ వేగవంతంపై హైకోర్టులో వాదనలు

### 15 ఏళ్లలో 150కి పైగా డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలయ్యాయన్న ఈడీ

### రోజువారీ విచారణ చేపట్టాలని హరిరామజోగయ్య తరపు న్యాయవాది వినతి

### తదుపరి విచారణ నవంబర్ 30కి వాయిదా




**హైదరాబాద్, నవంబర్ 19 (సమయం న్యూస్) :** జగన్ అక్రమాస్తుల కేసుల ప్రస్తుత పరిస్థితిపై పూర్తిస్థాయి స్టేటస్ రిపోర్టు సమర్పించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. ఈ కేసుల విచారణను వేగవంతం చేయాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), మాజీ ఎంపీ హరిరామజోగయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం ఉన్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. విచారణ సందర్భంగా ఈడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఈ వ్యవహారంలో దర్యాప్తు, న్యాయ ప్రక్రియ దాదాపు 15 ఏళ్లుగా కొనసాగుతోందని పేర్కొన్నారు. సీబీఐ కోర్టు పరిధిలో ఉన్న వివిధ కేసుల్లో ఇప్పటివరకు దాదాపు 150కి పైగా డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలయ్యాయని, దీనివల్ల విచారణలో జాప్యం జరుగుతోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులకు సంబంధించి సీబీఐ 11 ఛార్జిషీట్లు, ఈడీ 9 ప్రాసిక్యూషన్ ఫిర్యాదులు దాఖలు చేసినట్లు తెలిపారు. మరోవైపు సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఈ కేసులపై రోజువారీ విచారణ చేపట్టాలని హరిరామజోగయ్య తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. వాదనలు విన్న తెలంగాణ హైకోర్టు.. జగన్ కేసుల ప్రస్తుత స్థితిగతులపై సమగ్ర వివరాలతో స్టేటస్ రిపోర్టు అందించాలని స్పష్టం చేస్తూ తదుపరి విచారణను నవంబర్ 30కి వాయిదా వేసింది.



# ఎన్నికల సవాళ్లను ఎదుర్కొంటూ పోరాడతాం

**లోపాల పేరుతో పోటీకి దూరమైతే ప్రజాస్వామ్యానికి ముప్పు**

**చికాగో విశ్వవిద్యాలయం కార్యక్రమంలో రాహుల్ గాంధీ**

**మోదీ ప్రభుత్వం ప్రజల హక్కులను దెబ్బతీస్తోందన్న జైరాం రమేశ్**

**న్యూఢిల్లీ, నవంబర్ 19 (సమయం న్యూస్) :** భారత ప్రజాస్వామ్యంపై నమ్మకంతో ఎన్నికల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ పోరాటం కొనసాగిస్తామని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థలో లోపాలు ఉన్నాయని పోటీకి దూరమైతే ప్రజాస్వామ్యానికి ముగింపు పలికినట్లేనని అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా చికాగో విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజల ప్రజాస్వామ్య హక్కులను బలహీనపరుస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. పెద్ద నోట్ల రద్దును 'ఓటుబందీ'గా అభివర్ణించిన ఆయన.. ఓట్ల దొంగతనం కేవలం ఎన్నికల అక్రమాలకు సంబంధించిన అంశం కాదని, ప్రజల హక్కులు, గొంతుకపై జరుగుతున్న దాడి అని 'ఎక్స్' వేదికగా విమర్శించారు. పేదలు, కార్మికులు, రైతులు, యువత, మధ్యతరగతి ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఓటే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. సామాన్యుల సమస్యల కంటే కార్పొరేట్ ప్రయోజనాలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ధరల పెరుగుదల పొదుపును దెబ్బతీస్తుంటే నిరుద్యోగం యువత భవిష్యత్తును ప్రభావితం చేస్తోందని మండిపడ్డారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మార్పులు కార్మికుల ఉపాధి హక్కులపై ప్రభావం చూపుతున్నాయని ఆరోపించారు.

# దత్తత పిల్లలకు ప్రత్యేక గుర్తింపు వద్దు

**రికార్డుల్లో 'దత్తపుత్రుడు, దత్తపుత్రిక' పదాలు తొలగించాలి**

**నెల రోజుల్లో ఈఉడిస్ట్రిక్ట్ పోర్టల్ నిబంధనలు మార్చాలి**

**పిటిషనర్‌కు రెండు వారాల్లో కొత్త వారసత్వ పత్రం ఇవ్వాలి**

**కేరళ హైకోర్టు స్పష్టీకరణ**

**తిరువనంతపురం, నవంబర్ 19 (సమయం న్యూస్):** దత్తత తీసుకున్న పిల్లలను ప్రభుత్వ రికార్డుల్లో ప్రత్యేకంగా 'దత్తపుత్రుడు', 'దత్తపుత్రిక'గా పేర్కొనే విధానాన్ని తొలగించాలని కేరళ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. వారిని తల్లిదండ్రుల సొంత కుమారుడు, కుమార్తెగానే గుర్తించాలని జస్టిస్ పీవీ కున్హికృష్ణన్ స్పష్టం చేశారు. హిందూ దత్తత, మనోవర్తి చట్టంఉ1956లోని సెక్షన్ 12 ప్రకారం దత్తత తీసుకున్నప్పటి నుంచి పిల్లలకు సొంత సంతానంతో సమానమైన హక్కులు ఉంటాయని, అధికారిక పత్రాల్లో దత్తత అనే పదాన్ని ప్రస్తావించాల్సిన అవసరం లేదని న్యాయస్థానం అభిప్రాయపడింది. 1990లో నెల రోజుల వయసులో దత్తత తీసుకున్న తనను అన్ని ధ్రువపత్రాల్లో కుమార్తెగానే పేర్కొన్నప్పటికీ, తండ్రి మరణానంతరం 2024లో జారీ చేసిన వారసత్వ పత్రంలో 'దత్తపుత్రిక'గా నమోదు చేయడాన్ని ఓ మహిళ కోర్టులో సవాలు చేశారు. ఈఉడిస్ట్రిక్ట్ పోర్టల్ నిబంధనల ప్రకారమే అలా పేర్కొన్నామన్న ప్రభుత్వ వాదనను హైకోర్టు తిరస్కరించింది. పిటిషనర్‌కు రెండు వారాల్లోగా 'కుమార్తె' అని పేర్కొంటూ కొత్త వారసత్వ పత్రం జారీ చేయాలని త్రిసూర్ తహసీల్దార్‌ను ఆదేశించింది. నెల రోజుల్లోగా ఈఉడిస్ట్రిక్ట్ పోర్టల్ నుంచి దత్తపుత్రుడు, దత్తపుత్రిక ఆప్షన్లను తొలగించి నిబంధనలు సవరించాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది.

# బీఎస్6 వాహనాలకు మూడేళ్లకోసారి పీయూసీసీ

**కొత్త మోటారు వాహన నిబంధనలు నోటిపై**

**బీఎస్ఉ4కు ఆరు నెలలు, పాతవాటికి 3 నెలలే గడువు**

**పదేళ్లు దాటితే ఆర్నెల్లకోసారి రెన్యువల్ తప్పనిసరి**

**న్యూఢిల్లీ, నవంబర్ 19 (సమయం న్యూస్):** భారత్ స్టేజ్ (బీఎస్) వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం ఊరట కలిగించే నిర్ణయం తీసుకుంది. పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్ (పీయూసీసీ) వ్యాలిడిటీ విషయంలో కీలక మార్పులు చేస్తూ కేంద్ర మోటారు వాహనాల చట్టం నిబంధనలుఉ2026ను నోటిపై చేసింది. బీఎస్ఉ6 వాహనాలకు ప్రస్తుతం ఏడాదికోసారి ఇస్తున్న పీయూసీసీ గడువును మూడేళ్లకు పెంచింది. మరోవైపు బీఎస్ఉ4 వాహనాలకు ఈ గడువును ఆరు నెలలకు, అంతకన్నా పాతవైన బీఎస్ఉ1, 2, 3 వాహనాలకు మూడు నెలలకు తగ్గించింది. తాజా నిబంధనల ప్రకారం కొత్త బీఎస్ఉ6 వాహనం కొంటే మూడేళ్లకోసారి చొప్పున ఆరు సంవత్సరాల్లో రెండుసార్లు పీయూసీసీ చేయించాలి. 6 నుంచి 10 ఏళ్ల వాహనాలకు ఏటా, పదేళ్లు పైబడితే ఆరు నెలలకోసారి రెన్యువల్ తప్పనిసరి. బీఎస్ఉ6 రవాణా వాహనాలకు తొలి రిజిస్ట్రేషన్ తర్వాత ఆరేళ్ల వరకు ప్రతి రెండేళ్లకోసారి, 6 నుంచి 10 ఏళ్ల వరకు ఏటా, పదేళ్లు దాటితే ప్రతి ఆరు నెలలకోసారి పీయూసీసీ చేయించుకోవాలి. ఇప్పటివరకు వ్యక్తిగత బీఎస్ఉ1, 2, 3, 4 వాహనాలకు ప్రతి ఆరు నెలలకోసారి రెన్యువల్ నిబంధన అమల్లో ఉండేది.




# పెట్టుబడుల్లో 'ఇండియా ఫస్ట్'కు ప్రాధాన్యం

- **రాబోయే 20 ఏళ్ల నిర్ణయాలకు ఇదే ప్రాతిపదిక కావాలి**
- **వ్యవసాయం, ఔషధ రంగాల్లో దిగుమతులు తగ్గించాలి**
- **పన్ను రాయితీల ప్రయోజనాలు ఉద్యోగులకూ అందాలి**
- **ఫిక్కీ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ**

**న్యూఢిల్లీ, నవంబర్ 19 (సమయం న్యూస్):** భారత్‌ను స్వయం సమృద్ధి దేశంగా తీర్చిదిద్దడంలో పరిశ్రమలు కీలక పాత్ర పోషించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. రాబోయే 20 ఏళ్లలో ప్రతి దీర్ఘకాలిక పెట్టుబడి నిర్ణయం 'ఇండియా ఫస్ట్' ప్రాతిపదికగా ఉండాలని సూచించారు. ఢిల్లీలో జరిగిన ఫిక్కీ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో పెట్టుబడులు పెంచాలని, దేశాభివృద్ధికి అవసరమైన సంస్కరణలపై నేరుగా తనకు సూచనలు చేయాలని పరిశ్రమల ప్రతినిధులను కోరారు. మహాత్మాగాంధీ వందేళ్ల క్రితమే స్వదేశీ ఉత్పత్తులు, స్వయం సమృద్ధి గురించి చెప్పారని గుర్తుచేస్తూ, దేశీయ వస్తువుల నాణ్యతను పెంచి అంతర్జాతీయ మార్కెట్లలో పోటీపడాలని సూచించారు. విదేశాల్లో భారత ఉత్పత్తులకు ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా రైతుల నుంచి పంటల సేకరణకు వ్యవస్థలు ఏర్పాటు చేయాలని, ఔషధ తయారీలో ఉపయోగించే ఏపీఐలు, బల్క్ డ్రగ్స్‌ను దేశీయంగా ఉత్పత్తి చేసి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలని కోరారు.

**పన్ను రాయితీలు.. ఎగుమతుల రికార్డు**

కార్పొరేట్ పన్నును 30 నుంచి 22 శాతానికి తగ్గించామని, కొత్త పన్ను విధానంలో రూ.12 లక్షల వరకు ఆదాయానికి మినహాయింపు కల్పించామని మోదీ తెలిపారు. పన్ను రాయితీలతో పరిశ్రమలకు కలిగిన ప్రయోజనాలను ఉద్యోగుల సంఖ్య, వేతనాల పెంపు రూపంలో వారికి అందించారా అని ప్రశ్నించారు. గత 12ఉ13 ఏళ్లలో సుమారు 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారన్న ప్రపంచ బ్యాంకు నివేదికను ప్రస్తావించారు. అక్టోబర్‌లో వస్తు ఎగుమతులు 50 బిలియన్ డాలర్లకు చేరి రికార్డు సృష్టించాయని వెల్లడించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా లభించే అవకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటు దేశీయ వినియోగదారులకూ ఎగుమతి ప్రమాణాలతో కూడిన నాణ్యమైన వస్తువులు అందించాలని స్పష్టం చేశారు. 'భారత్ 2047' ఇతివృత్తంతో జరిగిన ఈ సదస్సుకు పరిశ్రమల ప్రముఖులు, రాయబారులు, విధాన నిర్ణేతలు సహా 2,500 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. 1927లో ఏర్పాటైన ఫిక్కీ 2027 ఏప్రిల్ 7న వందేళ్లు పూర్తి చేసుకోనుంది.



# స్టాలిన్‌ను ఓడించిన ఎమ్మెల్యే వీఎస్ బాబు కన్నుమూత

**75 ఏళ్ల వయసులో గుండెపోటుతో తుదిశ్వాస**

**కొలత్తూరులో స్టాలిన్‌పై 8,795 ఓట్ల మెజారిటీతో విజయం**

**తమిళనాడు అసెంబ్లీలో ఆరుకు చేరిన ఖాళీలు**

**చెన్నై, నవంబర్ 19 (సమయం న్యూస్) :** తమిళనాడు రాజకీయాల్లో విషాదం చోటుచేసుకుంది. కొలత్తూరు నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను ఓడించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఎమ్మెల్యే వీఎస్ బాబు (75) కన్నుమూశారు. శ్వాసకోశ సమస్యలతో సెప్టెంబర్ 9న చెన్నైలోని ఎంజీఎం హెల్త్‌కేర్ ఆసుపత్రిలో చేరిన ఆయన ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం విషమించడంతో గురువారం మధ్యాహ్నం 2.24 గంటలకు గుండెపోటుతో మరణించినట్లు ఆసుపత్రి వర్గాలు ప్రకటించాయి.



డీఎంకేలో ఏరియా కార్యదర్శిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన బాబు 2006లో పురసవాక్కం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2011లో కొలత్తూరు నుంచి స్టాలిన్ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. అనంతరం డీఎంకేకు దూరమై 2016లో అన్నాడీఎంకేలో చేరారు. ఈ ఏడాది టీవీకే తీర్థం పుచ్చుకుని 2026 అసెంబ్లీ ఎన్నికల్లో కొలత్తూరు నుంచి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో బాబుకు 82,997 ఓట్లు రాగా, స్టాలిన్‌కు 74,202 ఓట్లు పోలయ్యాయి. 8,795 ఓట్ల మెజారిటీతో ఆయన ఘనవిజయం సాధించారు. బాబు మృతితో తమిళనాడు అసెంబ్లీలో ఖాళీల సంఖ్య ఆరుకు చేరింది.

# అయోధ్యలో పోటీకి నేను సిద్ధం: యోగి

**అఖిలేష్ నామినేషన్ వేస్తే ముఖాముఖి తేల్చుకుంటా**

**గోరఖ్‌పూర్, నవంబర్ 19 (సమయం న్యూస్) :** అయోధ్య నుంచి ఎన్నికల్లో పోటీ చేయాలంటూ సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్ విసిరిన సవాల్‌పై ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఘాటుగా స్పందించారు. అఖిలేష్ అయోధ్య నుంచి నామినేషన్ దాఖలు చేస్తే, తాను కూడా అక్కడి నుంచే బరిలోకి దిగుతానని ప్రతిసవాల్ విసిరారు. గురువారం గోరఖ్‌పూర్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. "మీరు అయోధ్య నుంచి నామినేషన్ వేస్తే నేను కూడా వేస్తా. ముఖాముఖి పోటీ ఎలా ఉంటుందో చూద్దాం" అన్నారు. అఖిలేష్‌కు ఎదురుగా నిలబడి పోరాడే ధైర్యం లేదని, బలహీనులే ఎప్పుడూ వెనుక నుంచి దాడి చేస్తారని ఎద్దేవా చేశారు.



సమాజ్‌వాదీ పార్టీ మాఫియా శక్తులపై ఆధారపడి రాజకీయాలు చేస్తోందని యోగి ఆరోపించారు. ఆ పార్టీ పాలనలో యువత ఉపాధి అవకాశాలను అడ్డుకున్నారని, మహిళలు, వ్యాపారుల భద్రతను ప్రమాదంలోకి నెట్టారని మండిపడ్డారు. ఎస్పీ అంటేనే గూండాయిజం, అరాచకం, అల్లర్లు, కర్ఫ్యూలకు పర్యాయపదమని విమర్శించారు. రాష్ట్రంలో మాఫియాగిరీకి పాల్పడే వారిని చట్టప్రకారం మట్టిలో కలిపేయడానికి ఎక్కువ సమయం పట్టదని హెచ్చరించారు. ఇప్పటికే వారి ఆగడాలను అరికట్టామని, నేరగాళ్లపై మళ్లీ ఉచ్చు బిగించేందుకు సిద్ధమవుతున్నామని సీఎం స్పష్టం చేశారు.

# దావూద్ పాత నివాసం కూల్చివేతకు హైకోర్టు బ్రేక్

**భెండి బజార్‌లోని ప్రమాదకర భవనంపై బీఎంసీ బుల్డోజర్లు**

**వక్ఫ్ ఆస్తి అంటూ బాంబే హైకోర్టును ఆశ్రయించిన పిటిషనర్లు**

**నవంబర్ 25 వరకు యథాతథ స్థితికి ధర్మాసనం ఆదేశం**

**ముంబై, నవంబర్ 19 (సమయం న్యూస్) :** అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం కుటుంబం ఒకప్పుడు నివసించిన ముంబైలోని పాత భవనం కూల్చివేతకు బాంబే హైకోర్టు తాత్కాలికంగా అడ్డుకట్ట వేసింది. భెండి బజార్‌లోని పక్మోడియా స్ట్రీట్‌లో ఉన్న హాజీ ఇస్మాయిల్ హాజీ హబీబ్ ముసాఫిర్‌ఖానా భవనాన్ని బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) అధికారులు గురువారం కూల్చడం ప్రారంభించారు. అయితే ఆస్తి హక్కులపై పిటిషన్లు దాఖలు కావడంతో న్యాయస్థానం జోక్యం చేసుకుంది. 1970వ దశకంలో దావూద్ తన కుటుంబంతో కలిసి ఇదే భవనంలో నివసించాడు. 1986లో భారత్ విడిచివెళ్లే వరకు ఈ ప్రాంతం అతడి కార్యకలాపాలకు కేంద్రంగా ఉండేది. కాలక్రమంలో శిథిలావస్థకు చేరిన ఈ భవనాన్ని బీఎంసీ అత్యంత ప్రమాదకరమైన సీఉ1 కేటగిరీగా గుర్తించి, భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేత చేపట్టింది. అయితే ఇది హాజీ ఇస్మాయిల్ హాజీ హబీబ్ ముసాఫిర్‌ఖానా ట్రస్ట్‌కు చెందినదని, 1864లో హజ్ యాత్రికుల విశ్రాంతి భవనం, మసీదు నిర్మాణం కోసం కేటాయించిన వక్ఫ్ ఆస్తి అని ఇద్దరు పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. బీఎంసీ నోటీసులు, కూల్చివేత చర్యలు నిబంధనలకు విరుద్ధమని అభ్యంతరం వ్యక్తం చేశారు. భెండి బజార్ పునరాభివృద్ధి ప్రాజెక్టుతోనూ ఈ ఆస్తి వివాదానికి సంబంధం ఉంది. దీనిపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మహేశ్ చంద్ర త్రిపాఠి, జస్టిస్ అద్వైత్ సేథ్నాలతో కూడిన ధర్మాసనం.. నవంబర్ 25న తదుపరి విచారణ జరిగే వరకు కూల్చివేత నిలిపివేసి, యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశించింది.





# చలిపులికి గజగజలాడుతున్న కశ్మీర్

**శ్రీనగర్‌లో మైనస్ 0.2 డిగ్రీల ఉష్ణోగ్రత**

**పహల్గాం, గుల్మార్గ్‌లోనూ మైనస్ డిగ్రీలు**

**రాత్రిపూట చలి మరింత పెరుగుతుందన్న ఐఎండీ**

**శ్రీనగర్, నవంబర్ 19 (సమయం న్యూస్) :** చలి పులికి జమ్మూకశ్మీర్ గజగజా వణికిపోతోంది. కశ్మీర్‌లోని చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మైనస్ స్థాయికి పడిపోయాయి. వేసవి రాజధాని శ్రీనగర్‌లో బుధవారం రాత్రి ఈ సీజన్‌లో అత్యంత చల్లని ఉష్ణోగ్రత మైనస్ 0.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. అంతకుముందు షోపియాన్‌లో మైనస్ 3.4 డిగ్రీలు రికార్డయింది. ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన గుల్మార్గ్, పహల్గాంలోనూ మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలో మైనస్ 2.8, బారాముల్లాలో మైనస్ 1.0, కాజీగుండ్‌లో మైనస్ 0.8, కుప్వారాలో మైనస్ 1.3, కోకర్‌నాగ్‌లో 1 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం కశ్మీర్‌లోని వివిధ ప్రాంతాల్లో తేలికపాటి ఎండ కాచినా, చాలా చోట్ల మంచు కురిసింది. జమ్మూ సిటీలో 10.8 డిగ్రీలు, కట్రాలో 10.9, బటోట్‌లో 5.7, బనిహాల్‌లో 8.7, భదేర్వాలో 2.2 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ నెల చివరి వరకు కశ్మీర్ వ్యాప్తంగా పొడి వాతావరణం కొనసాగుతుందని, రానున్న రోజుల్లో రాత్రి ఉష్ణోగ్రతలు మరింత పడిపోతాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.




# ఒకే పోర్టల్‌లో అన్ని స్కాలర్‌షిప్‌లు

**'వన్ నేషన్-వన్ స్కాలర్‌షిప్'పై కేంద్రం దృష్టి**

**దరఖాస్తు ప్రక్రియలో సులభతరం, పారదర్శకతే లక్ష్యం**

**గ్రామీణ విద్యార్థులకు సమాన అవకాశాలపై జాతీయ సదస్సు**


**న్యూఢిల్లీ, నవంబర్ 19 (సమయం న్యూస్):** దేశవ్యాప్తంగా విద్యార్థులకు వివిధ ప్రభుత్వ స్కాలర్‌షిప్ పథకాల ప్రయోజనాలను సులభంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'వన్ నేషన్ఒవన్ స్కాలర్‌షిప్' పోర్టల్ విధానంపై దృష్టి సారించింది. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సదస్సులో ఈ అంశంపై విస్తృతంగా చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ స్కాలర్‌షిప్ పథకాల సమాచారాన్ని ఒకే వేదికపై అందుబాటులోకి తేవడం, అర్హతను సులభంగా గుర్తించడం, దరఖాస్తు ప్రక్రియను సరళతరం చేసి పారదర్శకతను పెంచడం ఈ విధానం ప్రధాన లక్ష్యం. ఇప్పటికే నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్ఎస్‌పీ) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలుండగా.. ఈ డిజిటల్ సేవలను గ్రామీణ, మారుమూల ప్రాంతాల విద్యార్థులకు మరింత చేరువ చేసి సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని సదస్సులో నొక్కిచెప్పారు.

# బంగాళాఖాతంలో వరుస తుఫానుల పంజా!

**రెండు నెలల్లోనే అర్ణబ్, మురసు, అక్వాన్ ఆవిర్భావం**

**ఇప్పటికే ఏపీ తీరాన్ని తాకిన అర్ణబ్, మురసు**

**గోపాల్‌పూర్ సమీపంలో తీరం దాటనున్న అక్వాన్**




**న్యూఢిల్లీ, నవంబర్ 19 (సమయం న్యూస్) :** ఈ ఏడాది అక్టోబర్ఉనవంబర్ నెలల్లో బంగాళాఖాతంలో వరుసగా మూడు తుఫానులు ఏర్పడి తీర ప్రాంతాలను కలవరపెట్టాయి. బంగ్లాదేశ్ సూచించిన పేరుతో అక్టోబర్ 26న ఏర్పడిన 'అర్ణబ్' అత్యంత తీవ్ర తుఫానుగా మారి అక్టోబర్ 28న బాపట్లఉవిశాఖపట్నం మధ్య ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటింది. ఆ సమయంలో గంటకు 115ఉ125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయగా, గాలివిసురు 140 కిలోమీటర్ల వరకు నమోదైంది.

**దక్షిణ ఏపీని తాకిన 'మురసు'**

అర్ణబ్ ప్రభావం తగ్గకముందే నవంబర్ 1న బంగాళాఖాతంలో 'మురసు' తుఫాను ఏర్పడింది. భారతదేశం సూచించిన ఈ తమిళ పదానికి సంప్రదాయ డప్పు లేదా భేరి అని అర్థం. నవంబర్ 2న తీవ్ర తుఫానుగా బలపడిన మురసు.. నవంబర్ 3 తెల్లవారుజామున నెల్లూరుఉనర్సాపూర్ మధ్య ఒంగోలు సమీపంలో దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటింది. ఆ సమయంలో గంటకు 100ఉ110 కిలోమీటర్ల వేగంతో గాలులు, 120 కిలోమీటర్ల వరకు గాలివిసురు నమోదైంది.

**తీరం దాటనున్న 'అక్వాన్'**

తాజాగా ఇరాన్ సూచించిన పేరుతో నవంబర్ 16న ఏర్పడిన 'అక్వాన్' తీవ్ర తుఫానుగా కొనసాగుతోంది. నవంబర్ 19 ఉదయం భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించిన వివరాల ప్రకారం.. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ తుఫాను ఉత్తరఉ వాయవ్య దిశగా కదులుతోంది. ఇది నవంబర్ 20 మధ్యాహ్నానికి ఉత్తర ఆంధ్రప్రదేశ్ఉ యానాం, దక్షిణ ఒడిశా తీరాల మధ్య నర్సాపూర్ఉపూరి ప్రాంతంలో గోపాల్‌పూర్‌కు సమీపంగా తీరం దాటే అవకాశం ఉంది. ఆ సమయంలో గంటకు 90ఉ100 కిలోమీటర్ల వేగంతో గాలులు, 110 కిలోమీటర్ల వరకు గాలివిసురు ఉండొచ్చని ఐఎండీ అంచనా వేసింది.

# టోల్ దాటితే బీమా గుట్టు రట్టు!

## ముండ్కా టోల్ వద్ద ఎన్‌హెచ్ఏఐ ప్రయోగాత్మక తనిఖీ

- **బీమా లేకుంటే నిమిషాల్లోనే ఫోన్‌కు ఎస్ఎంఎస్ హెచ్చరిక**
- **రెండోసారి ఉల్లంఘిస్తే రూ.10 వేల వరకు జరిమానా**

**న్యూఢిల్లీ, నవంబర్ 19 (సమయం న్యూస్):** జాతీయ రహదారులపై బీమా లేకుండా వాహనాలు నడిపే వారికి ఇకపై కఠిన పరిస్థితులు ఎదురుకానున్నాయి. వాహనాలకు తప్పనిసరిగా ఉండాల్సిన థర్డ్‌పార్టీ బీమా చెల్లుబాటును టోల్ ప్లాజాల వద్దనే గుర్తించే విధానాన్ని భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ప్రస్తుతం ఢిల్లీలోని ముండ్కా టోల్ ప్లాజా వద్ద ఈ వ్యవస్థను పరీక్షిస్తున్నారు. వాహనం టోల్ దాటగానే దాని రిజిస్ట్రేషన్ వివరాలను జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) నిర్వహించే 'వాహన్' డేటాబేస్‌లోని బీమా వివరాలతో ఈ వ్యవస్థ ఆటోమేటిక్‌గా సరిపోలుస్తుంది. బీమా గడువు ముగిసినా, చెల్లుబాటు అయ్యే థర్డ్‌పార్టీ బీమా లేకపోయినా కొద్ది నిమిషాల్లోనే వాహన యజమాని మొబైల్‌కు ఎస్ఎంఎస్ పంపుతుంది. అందులో వాహనం నంబర్, టోల్ దాటిన సమయం, బీమా ముగిసిన తేదీ వివరాలతో పాటు వెంటనే పునరుద్ధరించుకోకపోతే జరిమానా తప్పదని హెచ్చరిస్తుంది.




**వెంటనే జరిమానా పడుతుందా?**

టోల్ ప్లాజా దాటిన వెంటనే ప్రతి బీమా లేని వాహనానికి ఆటోమేటిక్‌గా రూ.10 వేల జరిమానా పడుతుందని ప్రస్తుతం చెప్పలేం. ముండ్కా వద్ద జరుగుతున్నది కేవలం వ్యవస్థ పనితీరును పరీక్షించి, వాహనదారులను అప్రమత్తం చేసే పైలట్ ప్రాజెక్టు మాత్రమే. దేశవ్యాప్తంగా ఎప్పుడు అమలు చేస్తారనే తేదీని ఎన్‌హెచ్ఏఐ ఇంకా ప్రకటించలేదు. అయితే మోటారు వాహనాల చట్టం ప్రకారం బీమా లేకుండా వాహనం నడిపితే మొదటిసారి ప్రాథమిక ప్రీమియానికి మూడు రెట్లు లేదా రూ.5 వేలు (ఏది ఎక్కువైతే అది), రెండోసారి లేదా తదుపరి ఉల్లంఘనకు ఐదు రెట్లు లేదా రూ.10 వేలు జరిమానా విధించే అవకాశం ఉంది.

**దేశవ్యాప్తంగా విస్తరణకు అవకాశం**

ముండ్కా ప్రయోగం విజయవంతమైతే ఈ వ్యవస్థను దేశవ్యాప్తంగా ఇతర టోల్ ప్లాజాలకు విస్తరించనున్నారు. దీనివల్ల ట్రాఫిక్ పోలీసులు ప్రతి వాహనాన్ని ఆపి పత్రాలు తనిఖీ చేయాల్సిన అవసరం తగ్గడంతో పాటు బీమా లేని వాహనాలను సులభంగా గుర్తించవచ్చు. బీమా లేని వాహనాలు ప్రమాదాలకు గురైనప్పుడు బాధితులకు పరిహారం అందడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో వాహనదారులు తమ బీమా గడువును తనిఖీ చేసుకుని, ముగియకముందే థర్డ్‌పార్టీ బీమాను పునరుద్ధరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# కేంద్ర-రాష్ట్రాల సమన్వయమే ప్రగతికి బాట

- **సహకార సమాఖ్యవాదానికి రాజ్యాంగం పెద్దపీట**
- **జీఎస్టీ మండలి, నీతి ఆయోగ్‌తో ఉమ్మడి నిర్ణయాలు**
- **ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా పథకాల అమలు కీలకం**

**న్యూఢిల్లీ, నవంబర్ 19 (సమయం న్యూస్) :** భారతదేశ సమగ్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో పనిచేయడం అత్యంత కీలకమని నిపుణులు పేర్కొంటున్నారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య సహకారం, సమన్వయాన్ని పెంచే విధానాన్నే 'సహకార సమాఖ్యవాదం'గా వ్యవహరిస్తారు. భారత రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్ ద్వారా కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాలను నిర్దేశించగా, ఆర్టికల్ 246 ప్రకారం శాసనాధికారాలను విభజించారు. ఆర్టికల్ 263 అంతర్రాష్ట్ర మండలి ఏర్పాటుకు వీలు కల్పిస్తోంది. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, జాతీయ ప్రాధాన్యత కలిగిన కార్యక్రమాల అమలులో రెండు స్థాయిల ప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయి.



**సమన్వయ వేదికలు.. అభివృద్ధికి ఊతం**

ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు కేంద్ర పన్నుల ఆదాయంలో రాష్ట్రాలకు వాటా, గ్రాంట్లు, కేంద్ర పథకాల ద్వారా ఆర్థిక సహకారం అందుతోంది. పన్ను విధానంలో కేంద్ర, రాష్ట్రాలు కలిసి నిర్ణయాలు తీసుకునే జీఎస్టీ మండలి సహకార సమాఖ్యవాదానికి ప్రధాన ఉదాహరణగా నిలుస్తోంది. రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి విధానాలను రూపొందించడంలో నీతి ఆయోగ్, సమస్యల పరిష్కారానికి అంతర్రాష్ట్ర మండలి కీలక వేదికలుగా పనిచేస్తున్నాయి. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, మౌలిక వసతులు, పేదరిక నిర్మూలన వంటి రంగాల్లో రాష్ట్రాల ఆర్థిక అవసరాలు, వనరులను పరిగణనలోకి తీసుకుని కేంద్ర, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలవుతాయి.




# దివ్యాంగులకు అడ్డంకులు లేని సమాజమే లక్ష్యం

**'సుగమ్య భారత్-వికసిత భారత్'పై కేంద్రం ప్రత్యేక దృష్టి**

**భౌతిక వసతులతో పాటు డిజిటల్ సేవలూ అందుబాటులోకి**

**విద్య, ఉపాధి అవకాశాలతో సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక**

**న్యూఢిల్లీ, నవంబర్ 19 (సమయం న్యూస్):** దివ్యాంగులు సమాజంలోని అన్ని రంగాల్లో సమాన అవకాశాలతో ముందుకు సాగేందుకు అనుకూల వాతావరణాన్ని కల్పించడమే 'సుగమ్య భారత్ఉ వికసిత భారత్' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సమావేశంలో ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చించారు. దివ్యాంగులకు విద్య, ఉపాధి, రవాణా, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ప్రదేశాల్లో భౌతిక సౌకర్యాలతో పాటు డిజిటల్, సమాచార, కమ్యూనికేషన్ వ్యవస్థలను కూడా సులభంగా అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరాన్ని కేంద్రం గుర్తించింది.

**వికసిత భారత్‌తో సుగమ్యత అనుసంధానం**

దేశవ్యాప్తంగా దివ్యాంగులకు అడ్డంకులు లేని వాతావరణాన్ని కల్పించే ఉద్దేశంతో కేంద్రం 2015 డిసెంబర్ 3న 'సుగమ్య భారత్ అభియాన్'ను ప్రారంభించింది. దీని ద్వారా ప్రభుత్వ భవనాలు, రవాణా వ్యవస్థలు, వెబ్‌సైట్లు, డిజిటల్ సేవలను దివ్యాంగులకు అనుకూలంగా తీర్చిదిద్దుతున్నారు. దేశం సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు లభించాలని, దివ్యాంగుల సామర్థ్యాలను గుర్తించి విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను పెంచడం ద్వారా వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని కేంద్రం పేర్కొంది.

# భువనేశ్వర్‌లో అంతర్జాతీయ ఆక్వా సదస్సు

**ఏడు దేశాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధుల హాజరు**

**ఆధునిక చేపల పెంపకం, కృత్రిమ మేధపై ప్రత్యేక చర్చలు**

**20 సంస్థలతో ఆక్వా సాంకేతికతల ప్రదర్శన ఏర్పాటు**

**భువనేశ్వర్, నవంబర్ 19 (సమయం న్యూస్):** ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఐసీఏఆర్ఉకేంద్ర మంచినీటి ఆక్వాకల్చర్ సంస్థ ఆధ్వర్యంలో 14వ భారతీయ మత్స్య, ఆక్వాకల్చర్ ఫోరం ప్రారంభమైంది. నవంబర్ 18 నుంచి 20 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు భారత్‌తో పాటు మరో ఆరు దేశాల నుంచి 1,000 మందికి పైగా శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విధాన నిర్ణేతలు, పరిశ్రమ ప్రతినిధులు, రైతులు హాజరయ్యారు. "మత్స్య, ఆక్వాకల్చర్ రంగాన్ని మార్చడంఉశాస్త్రం, సమాజం మధ్య వారధి" అనే అంశంపై నిర్వహిస్తున్న ఈ సదస్సులో మత్స్య సంపద సంరక్షణ, స్థిరమైన నిర్వహణ, కృత్రిమ మేధస్సు, జన్యు సాంకేతికత, ఆధునిక చేపల పెంపకం, మేత అభివృద్ధి, జలజంతువుల ఆరోగ్యం తదితర అంశాలపై విస్తృతంగా చర్చిస్తున్నారు.

**సాంకేతిక ఆవిష్కరణలపై నిపుణుల సూచనలు**

సదస్సు ప్రారంభోత్సవంలో ఆసియాఉపసిఫిక్ ఆక్వాకల్చర్ కేంద్రాల నెట్‌వర్క్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎడ్వర్డో లియానో మాట్లాడుతూ.. మత్స్యరంగంలో సాంకేతిక ఆవిష్కరణలను వేగవంతం చేసి విస్తృతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మత్స్యకారుల జీవనోపాధి మెరుగుదలకు సహకార సంఘాలను బలోపేతం చేయాలని ఎన్ఎఫ్‌డీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ బి.కె. బెహెరా సూచించారు. ఈ సదస్సుతో పాటు 20 సంస్థలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో మత్స్య, ఆక్వాకల్చర్ రంగానికి చెందిన నూతన సాంకేతికతలు, ఉత్పత్తులు, ఆవిష్కరణలను ప్రదర్శిస్తున్నారు.





# పంచాయతీ ఎన్నికల్లో అక్రమాలు: కొడాలి నాని

**దాడులు, రిగ్గింగ్‌తో గెలిచారని మాజీ మంత్రి ఆరోపణ**

**ఆరోపణలను ఖండించిన అధికార టీడీపీ వర్గాలు**

**వైసీపీ హింసపై ఈసీకి వర్ల రామయ్య బృందం ఫిర్యాదు**

**గుడివాడ, నవంబర్ 19 (సమయం న్యూస్):** రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో అధికార కూటమి ప్రభుత్వం తీవ్ర అక్రమాలకు పాల్పడుతోందని వైసీపీ నేత, మాజీ మంత్రి కొడాలి నాని ఆరోపించారు. కృష్ణా జిల్లా గుడివాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన చంద్రబాబు ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. నామినేషన్లు వేయనీయకుండా దాడులు చేయడం, పోలింగ్ రోజు రిగ్గింగ్‌లకు పాల్పడుతూ గెలిచామని చెప్పుకుంటున్నారని ఆయన ఆరోపించారు. వైసీపీ బలం పుంజుకున్న ప్రాంతాల్లో రాయలసీమ నుంచి పల్నాడు వరకు అనేక మున్సిపాలిటీలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో దౌర్జన్యాలకు పాల్పడి బలవంతంగా ఏకగ్రీవాలు చేసుకున్నారని విమర్శించారు. కోస్తా ప్రాంతాల్లో మద్యం, డబ్బు విచ్చలవిడిగా పంపిణీ చేసి, పోలీసులను లోబర్చుకుని ఎన్నికల్లో నెగ్గారని పేర్కొన్నారు. మరోవైపు కొడాలి నాని చేసిన ఆరోపణలను అధికార టీడీపీ వర్గాలు ఖండించాయి. పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో వైసీపీ శ్రేణులే పలుచోట్ల అరాచకాలకు పాల్పడుతున్నాయని టీడీపీ ఎదురు ఆరోపణలు చేసింది. కడప, పల్నాడు జిల్లాల్లో వైసీపీ కార్యకర్తలు హింసకు పాల్పడుతున్నారంటూ టీడీపీ నేత వర్ల రామయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. అందుకు సంబంధించిన వీడియో ఆధారాలను కూడా ఎన్నికల కమిషన్‌కు సమర్పించింది. పంచాయతీ ఎన్నికల వేళ ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం మరింత ముదురుతోంది.

# 'అక్వాన్' ఎఫెక్ట్.. 31 ఎన్డీఆర్ఎఫ్ బృందాల మోహరింపు

**ఐదు రాష్ట్రాలు, ఒక యూటీలో దళాలు సిద్ధం**

**అత్యవసర సేవలకు రిజర్వ్‌లో మరో 18 బృందాలు**

**గరిష్ఠంగా 110 కి.మీ. వేగంతో గాలుల హెచ్చరిక**

**న్యూఢిల్లీ, నవంబర్ 19 (సమయం న్యూస్):** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న 'అక్వాన్' తీవ్ర తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) పూర్తిస్థాయిలో సన్నద్ధమైంది. ఉత్తరం వైపు కదులుతున్న ఈ తుపాను దృష్ట్యా ఐదు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో మొత్తం 31 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను మోహరించారు. వీటికి తోడు అత్యవసర పరిస్థితుల కోసం మరో 18 బృందాలను రిజర్వ్‌లో ఉంచారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని నర్సాపూర్ నుంచి ఒడిశాలోని పూరీ మధ్య తుపాను తీరం దాటే అవకాశం ఉంది. ఉత్తర ఆంధ్రప్రదేశ్ఉయానాం, దక్షిణ ఒడిశా తీరాల మధ్య సాయంత్రం సమయంలో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్లు, గరిష్ఠంగా 110 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తూ తీరం దాటే సూచనలు ఉన్నాయి. ఆ తర్వాత ఇది తీవ్ర వాయుగుండంగా బలహీనపడనుంది. తుపాను ప్రభావం ఎక్కువగా ఉండే ఒడిశాలోని గంజాంలో 3, పూరీ, కోరాపుట్‌లలో 2 చొప్పున, బాలాసోర్, కేంద్రపారా, కంధమాల్, రాయగడ, మల్కన్‌గిరి, గజపతి, జగత్సింగ్‌పూర్ జిల్లాల్లో ఒక్కో బృందాన్ని మోహరించారు. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నంలో 4, శ్రీకాకుళంలో 3, పార్వతీపురం మన్యంలో 2, కృష్ణా జిల్లాలో ఒక బృందాన్ని సిద్ధంగా ఉంచారు. తెలంగాణలో 3, తమిళనాడులో 3, ఛత్తీస్‌గఢ్‌లో 1, అండమాన్ నికోబార్ దీవుల్లో 1 బృందాన్ని నియమించారు. రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎన్డీఆర్ఎఫ్ వెల్లడించింది.

# మూడేళ్ల చిన్నారి చేతులు కట్టేసి టీచర్ దాడి

**తమిళనాడు తిరువారూర్ ప్రైవేటు స్కూల్‌లో దారుణం**

**సీసీటీవీ ఫుటేజీతో వెలుగులోకి వచ్చిన ఘటన**

**టీచర్, సహాయకురాలిని ప్రశ్నిస్తున్న పోలీసులు**

**తిరువారూర్, నవంబర్ 19 (సమయం న్యూస్) :** తమిళనాడులోని తిరువారూర్ జిల్లాలో ఓ ప్రైవేటు పాఠశాలలో మూడేళ్ల చిన్నారి చేతులను నైలాన్ తాడుతో కట్టేసి టీచర్ దాడి చేసిన ఘటన కలకలం రేపింది. తిరుత్తురాయ్‌పూండిలోని సాయిరాం మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో ప్రీ కేజీ చదువుతున్న బాలుడు మంగళవారం ఇంటికి తిరిగి వచ్చాక శరీరంపై గాయాలను తల్లిదండ్రులు గోపీనాథ్, మహిమ గమనించారు. ఏమైందని అడగ్గా టీచర్, సహాయకురాలు తన చేతులు కట్టేసి కొట్టారని బాలుడు చెప్పాడు. దీంతో తల్లిదండ్రులు స్కూల్‌కు వెళ్లి క్లాస్‌రూమ్ సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా దారుణం వెలుగులోకి వచ్చింది. బాలుడి చేతులను టీచర్ నైలాన్ తాడుతో కట్టడం, సహాయకురాలు పిల్లవాడిని ఒక స్క్రీన్‌పై నొక్కిపెట్టడం అందులో కనిపించింది. ఆ ఫుటేజీని మొబైల్‌లో రికార్డు చేసిన గోపీనాథ్ తిరుత్తురాయ్‌పూండి పోలీసులకు ఫిర్యాదు చేసి, పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కేసు నమోదు చేసిన పోలీసులు టీచర్ భాగ్యలక్ష్మి (26), స్కూల్ అసిస్టెంట్ సెల్వి (55)ని ప్రశ్నిస్తున్నారు. చిన్నారి చేతులు కట్టేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# చెన్నైలో రూ.710 కోట్ల హెరాయిన్ పట్టివేత

**చెన్నై, నవంబర్ 19 (సమయం న్యూస్) :** తమిళనాడు రాజధాని చెన్నైలో భారీగా హెరాయిన్ పట్టుబడటం సంచలనం సృష్టించింది. అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్ ముఠా అక్రమ రవాణా ప్రయత్నాన్ని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు భగ్నం చేశారు. శ్రీలంకకు అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన సుమారు 71.24 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.710 కోట్లుగా అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా పట్టుబడిన అత్యధిక హెరాయిన్ నిల్వల్లో ఇది ఒకటిగా అధికారులు పేర్కొంటున్నారు.

# పీఎం స్వనిధి సమ్మాన్ అవార్డులు

- **ఢిల్లీలో 52 అవార్డులు, 5 ప్రత్యేక గుర్తింపుల ప్రదానం**
- **ఇప్పటివరకు 81 లక్షల మందికి రూ.20 వేల కోట్ల రుణాలు**
- **రెండో విడత చెల్లించిన వారికి రూ.30 వేల రూపే క్రెడిట్ కార్డు**




**న్యూఢిల్లీ, నవంబర్ 19 (సమయం న్యూస్):** వీధి వ్యాపారుల జీవనోపాధి బలోపేతం, ఆర్థిక సమగ్రత, డిజిటల్ సేవల వినియోగం, సామాజిక భద్రతలో విశేష కృషి చేసిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, పట్టణ స్థానిక సంస్థలు, రుణ, భాగస్వామ్య సంస్థలకు 'పీఎం స్వనిధి సమ్మాన్ అవార్డులు2026' ప్రదానం చేయనున్నారు. నవంబర్ 20న న్యూఢిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జరిగే కార్యక్రమంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ అవార్డులు అందజేస్తారు. కేంద్ర సహాయ మంత్రి తోఖన్ సాహు ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ వేడుకలో మొత్తం 52 అవార్డులు, 5 ప్రత్యేక గుర్తింపులు ప్రదానం చేయనున్నారు. సుమారు 600 మంది ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

**2030 వరకు పొడిగింపు.. కొత్త సదుపాయాలు**

2020 జూన్‌లో పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 81 లక్షల మంది వీధి వ్యాపారులకు 1.21 కోట్లకు పైగా రుణాల రూపంలో దాదాపు రూ.20 వేల కోట్లు అందించినట్లు కేంద్రం వెల్లడించింది. 2025 ఆగస్టులో పథకాన్ని పునర్వ్యవస్థీకరించి 2030 మార్చి వరకు పొడిగించారు. రెండో విడత రుణాన్ని తిరిగి చెల్లించిన అర్హులైన లబ్ధిదారులకు రూ.30 వేల వరకు యూపీఐ అనుసంధానిత రూపే క్రెడిట్ కార్డు అందించే విధానాన్ని ప్రవేశపెట్టారు. అంతేకాకుండా ఈ పథకాన్ని పట్టణ ప్రాంతాలకే పరిమితం చేయకుండా జనగణన పట్టణాలు, పట్టణ పరిసర ప్రాంతాలకు కూడా విస్తరించారు

# ధాబాలోకి దూసుకెళ్లిన ట్రక్కు.. ముగ్గురు మృతి

- **మధ్యప్రదేశ్ జబల్‌పూర్ జిల్లాలో ఘోరం**
- **ఆగి ఉన్న వాహనాలను ఢీకొట్టి బోల్తా**
- **ధాబా యజమానికి తీవ్ర గాయాలు**



**జబల్‌పూర్, నవంబర్ 19 (సమయం న్యూస్) :** మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ జిల్లా భేడాఘాట్ సమీపంలోని ఎన్‌హెచ్ఉ45 జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మొక్కజొన్న లోడుతో అతివేగంగా వెళ్తున్న ఓ ట్రక్కు అదుపుతప్పి రహదారి పక్కన పార్క్ చేసి ఉన్న బొలెరో, కారు, పికప్ సహా పలు వాహనాలను బలంగా ఢీకొట్టింది. అనంతరం రోడ్డు పక్కన ఉన్న రాజ్ ఫ్యామిలీ ధాబాలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బలరామ్, మోను, ధర్మేంద్ర అనే ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ధాబా యజమానిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో ధాబా సమీపంలో పలువురు మంట చుట్టూ చేరి చలి కాచుకుంటున్నట్లు సమాచారం.

# కాలువలోకి దూసుకెళ్లిన స్కార్పియో.. ఆరుగురు మృతి

- **బిహార్ అరేరియా జిల్లాలో అర్ధరాత్రి విషాదం**
- **పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం**
- **తీవ్రంగా గాయపడిన మరొకరు ఆసుపత్రికి తరలింపు**




**అరేరియా, నవంబర్ 19 (సమయం న్యూస్) :** బిహార్‌లోని అరేరియా జిల్లాలో గురువారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తారాబారి పోలీస్ స్టేషన్ పరిధిలోని బీడీ వంతెన సమీపంలో వేగంగా వెళ్తున్న స్కార్పియో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వాహనంలోని వారు తేరుకునేలోపే అది కాలువలో పడిపోయినట్లు సమాచారం.

మృతులంతా సుపాల్ జిల్లాకు చెందినవారిగా గుర్తించారు. వీరంతా ఓ పెళ్లి వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా ఈ విషాదం జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రూ.13 లక్షలకు సుపారీ ఇచ్చి మహిళ హత్య

- **భర్త వివాహేతర సంబంధంపై భార్య కుట్ర**
- **ఇండిగో ఉద్యోగిని హత్య కేసులో నలుగురి అరెస్టు**
- **200 సీసీటీవీల ఆధారంగా కేసు ఛేదించిన పోలీసులు**




**గోండియా, నవంబర్ 19 (సమయం న్యూస్) :** మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ సరిహద్దు ప్రాంతమైన గోండియా జిల్లాలో ఇండిగో మహిళా ఉద్యోగిని వర్షా తుర్కర్ (35) హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. భర్తకు ఆమెతో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో భార్య మోనా అగర్వాల్ (41) ఈ హత్యకు కుట్ర పన్నినట్లు పోలీసుల విచారణలో తేలింది. వర్షా తుర్కర్ నవంబర్ 14న తన స్నేహితుడు నితేష్ అగర్వాల్‌తో కలిసి బయటకు వెళ్లి తిరిగి వస్తుండగా బోండ్రాని గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆగారు. అదే సమయంలో బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు వర్షాపై కత్తులతో దాడి చేసి హత్య చేశారు.

ఈ కేసును ఛేదించేందుకు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు దాదాపు 200 సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి నిందితుల కుట్రను గుర్తించారు. తన భర్తకు వర్షాతో ఉన్న సంబంధాన్ని సహించలేక మోనా అగర్వాల్.. కునాల్ కుంభల్కర్ సహాయంతో హత్యకు పథకం వేసింది. షారుఖ్ పఠాన్ ద్వారా రూ.13 లక్షలకు సుపారీ కుదిర్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కుట్రలో భాగంగా ముగ్గురు దుండగులు నితేష్ కారును వెంబడించి వర్షాను హతమార్చారు. కేసులో మోనా అగర్వాల్‌తో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేయగా, పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

# నికోల్స్ శతకం.. కివీస్ ప్రతిఘటన



- 70/5 నుంచి 243/5కు చేరిన న్యూజిలాండ్
- ఫిలిప్స్ (94లి)తో అజేయంగా 173 పరుగుల భాగస్వామ్యం
- ఆరంభంలో చెలరేగిన బుమ్రాకు మూడు వికెట్లు
- చివరి సెషన్‌లో వికెట్ తీయలేకపోయిన భారత్

**వెల్లింగ్టన్, నవంబర్ 19 (సమయం న్యూస్):** బేసిన్ రిజర్వ్ వేదికగా భారత్‌తో ప్రారంభమైన తొలి టెస్టు మొదటి రోజు ఆటలో న్యూజిలాండ్ అద్భుతంగా పుంజుకుంది. ఆరంభంలో భారత పేసర్ల ధాటికి 70 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన ఆతిథ్య జట్టును హెన్రీ నికోల్స్ (113 నాటౌట్), గ్లెన్ ఫిలిప్స్ (94 నాటౌట్) ఆదుకున్నారు. వీరిద్దరూ నాలుగు గంటలకు పైగా క్రీజులో పాతుకుపోయి ఆరో వికెట్‌కు అజేయంగా 173 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ 82 ఓవర్లలో 5 వికెట్లకు 243 పరుగులు చేసి పటిష్ఠ స్థితికి చేరుకుంది.

### ఆరంభంలో బుమ్రా నిప్పులు.. టాప్ ఆర్డర్ కుదేలు

పచ్చికతో కూడిన పిచ్‌పై టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. ఆ నిర్ణయాన్ని నిజం చేస్తూ స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తొలి ఓవర్లోనే కివీస్ కెప్టెన్ టామ్ లాథమ్ (0)ను బౌల్డ్ చేసి షాక్ ఇచ్చాడు. ఆ వెంటనే అన్షుల్ కాంబోజ్ బౌలింగ్‌లో డెవాన్ కాన్వే (4) వికెట్ కీపర్ రిషభ్ పంత్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. కాసేపు ప్రతిఘటించిన రచిన్ రవీంద్ర (15)ను ఆకాశ్ దీప్ ఔట్ చేయగా, తన రెండో స్పెల్‌లో డారిల్ మిచెల్ (1)ను బుమ్రా పెవిలియన్‌కు పంపాడు. దీంతో తొలి సెషన్ ముగిసేసరికి కివీస్ 60/4తో కష్టాల్లో పడింది. భోజన విరామం తర్వాత టామ్ బ్లండెల్ (5)ను కూడా బుమ్రా ఔట్ చేయడంతో 70 పరుగుల వద్ద ఐదో వికెట్ కోల్పోయిన న్యూజిలాండ్ తక్కువ స్కోరుకే కుప్పకూలేలా కనిపించింది.

### నికోల్స్ రికార్డు శతకం.. ఫిలిప్స్ మెరుపులు

కష్టాల్లో ఉన్న జట్టును నికోల్స్, ఫిలిప్స్ జోడీ తిరుగులేని పోరాట పటిమతో ఆదుకుంది. నికోల్స్ ఎంతో ఓపికగా ఆడుతూ 188 బంతుల్లో కెరీర్‌లో 12వ టెస్టు సెంచరీని పూర్తి చేశాడు. బేసిన్ రిజర్వ్ మైదానంలో ఆడిన 15 ఇన్నింగ్స్‌లలో అతనికిది ఐదో టెస్టు శతకం కావడం విశేషం. మొత్తం 221 బంతులు ఎదుర్కొన్న నికోల్స్ 14 ఫోర్లతో అజేయంగా నిలిచాడు. మరోవైపు ఫిలిప్స్ ఆరంభంలో టీవీ అంపైర్ నిర్ణయంతో ఓసారి తప్పించుకున్నప్పటికీ, ఆ తర్వాత తనదైన దూకుడుతో 73 బంతుల్లోనే అర్ధశతకం బాదాడు. ఇదే ఇన్నింగ్స్‌లో టెస్టుల్లో 1,000 పరుగుల మైలురాయిని దాటిన అతడు 182 బంతుల్లో 13 ఫోర్లతో 94 పరుగులు చేసి సెంచరీకి ఆరు పరుగుల దూరంలో నిలిచాడు.

### రెండో కొత్త బంతిపైనే ఆశలు

బంతి పాతబడిన తర్వాత భారత బౌలర్ల పదును తగ్గింది. రెండో సెషన్‌లో ఒకే వికెట్ తీసిన భారత్, ఆఖరి సెషన్‌లో ఒక్క వికెట్ కూడా పడగొట్టలేకపోయింది. చివరి సెషన్‌లో కివీస్ బ్యాటర్లు వికెట్ కోల్పోకుండా 103 పరుగులు జోడించి టీమిండియాపై ఒత్తిడి పెంచారు. వ్యక్తిగత స్కోరు 102 వద్ద నికోల్స్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను దేవదత్ పడిక్కల్, రిషభ్ పంత్ సమన్వయ లోపంతో నేలపాలు చేయడం భారత్‌కు భారంగా మారింది. శుభ్‌మన్ గిల్ బౌలర్లను మార్చి మార్చి ప్రయోగించినా ఫలితం లేకపోయింది. భారత బౌలర్లలో బుమ్రా (3/52) రాణించగా, కాంబోజ్ (1/57), ఆకాశ్ దీప్ (1/33) తలో వికెట్ తీశారు. ప్రసిద్ధ్ కృష్ణ (0/58), వాషింగ్టన్ సుందర్ (0/38) వికెట్ల ఖాతా తెరవలేకపోయారు. రెండో కొత్త బంతిని తీసుకుని కేవలం రెండు ఓవర్లు మాత్రమే వేసిన నేపథ్యంలో రెండో రోజు తొలి సెషన్ ఇరు జట్లకు అత్యంత కీలకం కానుంది. ఆట ముగిసిన అనంతరం నికోల్స్ మాట్లాడుతూ.. ఫిలిప్స్ క్రీజులోకి వచ్చి బౌలర్లపై ఎదురుదాడి చేయడం వల్లే తాను ఒత్తిడి లేకుండా ఆడగలిగానని, ఇద్దరూ అజేయంగా రోజును ముగించడం సంతోషంగా ఉందని తెలిపాడు.

### సంక్షిప్త స్కోరు:

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 82 ఓవర్లలో 243/5 (హెన్రీ నికోల్స్ 113 నాటౌట్, గ్లెన్ ఫిలిప్స్ 94 నాటౌట్, రచిన్ రవీంద్ర 15; జస్‌ప్రీత్ బుమ్రా 3/52, ఆకాశ్ దీప్ 1/33, అన్షుల్ కాంబోజ్ 1/57).



# యోగ్‌రాజ్ వద్ద అనయ బంగర్ శిక్షణ

**న్యూఢిల్లీ, నవంబర్ 19 (సమయం న్యూస్) :** భారత మాజీ క్రికెటర్ సంజయ్ బంగర్ కుమార్తె అనయ బంగర్ క్రికెట్ మైదానంలోకి రీఎంట్రీ ఇచ్చేందుకు సన్నాహాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ప్రముఖ కోచ్, మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ తండ్రి యోగ్‌రాజ్ సింగ్ వద్ద ప్రత్యేక శిక్షణ ప్రారంభించింది. ఆయన పర్యవేక్షణలో నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్న ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పంచుకుంది. అనయ బ్యాటింగ్ శైలిపై సంతృప్తి వ్యక్తం చేసిన యోగ్‌రాజ్.. ఆమె 'బ్యాట్ ఫ్లో' చాలా బాగుందని ప్రశంసిస్తూ, ఆటలో మరిన్ని మెలకువలు నేర్చుకోవాలని ప్రోత్సహించాడు. యువరాజ్ సహా ఎందరో ప్రతిభావంతులను తీర్చిదిద్దిన యోగ్‌రాజ్ వద్ద శిక్షణ తీసుకోవడం తన ఆటకు ఎంతో మేలు చేస్తుందని అనయ పేర్కొంది.

లింగ మార్పిడి చేసుకున్న క్రీడాకారులకు సంబంధించి క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) రూపొందించిన నూతన నిబంధనల ప్రకారం.. ఉన్నత స్థాయి (ఎలైట్) క్రికెట్ ఆడేందుకు అనయకు ఇప్పటికే అధికారిక అనుమతి లభించింది. క్రికెట్ ఆస్ట్రేలియా తరహాలోనే బీసీసీఐ కూడా మహిళల క్రికెట్‌లో ట్రాన్స్‌జెండర్ క్రీడాకారులకు అవకాశాలు కల్పించేలా మార్గదర్శకాలు రూపొందిస్తే బాగుంటుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేసింది. గతంలో పురుషుడిగా భారత దేశవాళీ క్రికెట్ ఆడిన అనయ, లింగ మార్పిడి చికిత్సతో మహిళగా మారింది. క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయంపై దక్షిణాఫ్రికా క్రీడాకారిణి మారిజానే కాప్ వంటి కొందరు చేసిన విమర్శలకు శాస్త్రీయ ఆధారాలతో ఆమె సమాధానమిచ్చింది. హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ (హెచ్ఆర్‌టీ) తర్వాత మాంచెస్టర్ యూనివర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ నిర్వహించిన పరీక్షల్లో తన శారీరక సామర్థ్యాలు సాధారణ మహిళా అథ్లెట్లకు సమానంగా ఉన్నాయని తేలినట్లు అనయ స్పష్టం చేసింది.

# ఒలింపిక్ ఛాంపియన్‌కు రక్షిత షాక్!

- హాంకాంగ్ ఓపెన్‌లో చెన్ యుఫీని చిత్తు చేసిన భారత యువ షట్లర్

**హాంకాంగ్, నవంబర్ 19 (సమయం న్యూస్) :** భారత మహిళల బ్యాడ్మింటన్‌లో మరో సరికొత్త అధ్యాయం మొదలైంది. ప్రతిష్ఠాత్మక హాంకాంగ్ ఓపెన్ 2026 సూపర్ 500 టోర్నమెంట్‌లో 19 ఏళ్ల భారత యువ సంచలనం రక్షిత రామ్‌రాజ్ అద్భుతం చేసింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో మాజీ ఒలింపిక్ ఛాంపియన్, చైనా దిగ్గజ క్రీడాకారిణి చెన్ యుఫీని మట్టికరిపించి ప్రపంచ బ్యాడ్మింటన్ వర్గాలను విస్మయానికి గురిచేసింది. వరుస గేమ్‌ల్లో 21ఉ18, 24ఉ22 తేడాతో చిరస్మరణీయ విజయాన్ని అందుకున్న రక్షిత, తన కెరీర్‌లో తొలిసారి ఓ సూపర్ 500 టోర్నమెంట్ క్వార్టర్ ఫైనల్‌లోకి ఘనంగా ప్రవేశించింది. అనుభవజ్ఞురాలైన చైనా స్టార్‌ను ఓడించడం ద్వారా అంతర్జాతీయ వేదికపై తన సత్తాను చాటుకుంది. ప్రపంచ మేటి క్రీడాకారిణిగా పేరొందిన చెన్ యుఫీతో జరిగిన ఈ పోరులో రక్షిత ఎక్కడా తడబడలేదు. ప్రత్యర్థి స్థాయిని చూసి ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా, తొలి పాయింట్ నుంచే అద్భుతమైన ఆత్మవిశ్వాసంతో ఆటను ప్రారంభించింది. కోర్టు నలుమూలలా వేగంగా కదులుతూ తనదైన దూకుడును ప్రదర్శించింది. ముఖ్యంగా తెలివైన ఓవర్‌హెడ్ డిసెప్షన్ షాట్లు, పదునైన అటాకింగ్ స్ట్రోక్స్‌తో చైనా షట్లర్‌ను ఉక్కిరిబిక్కిరి చేసింది. ప్రత్యర్థికి ఏ దశలోనూ తేలిగ్గా పాయింట్లు దక్కకుండా కట్టడి చేస్తూ తొలి గేమ్‌ను 21ఉ18తో కైవసం చేసుకుంది.



తొలి గేమ్ కోల్పోవడంతో తేరుకున్న చెన్ యుఫీ రెండో గేమ్‌లో తీవ్ర ప్రతిఘటన చూపింది. ప్రతి పాయింట్ కోసం ఇరువురు షట్లర్లు హోరాహోరీగా తలపడటంతో మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. కీలక దశలో ఒత్తిడి పెరిగినప్పటికీ రక్షిత పట్టు వదలకుండా సంయమనంతో ఆడుతూ ప్రత్యర్థి వ్యూహాలను తిప్పికొట్టింది. చివరకు నరాలు తెగే ఉత్కంఠ నడుమ రెండో గేమ్‌ను 24ఉ22తో సొంతం చేసుకుని మ్యాచ్‌ను ముగించింది. అంతకుముందు తొలి రౌండ్‌లోనూ డెన్మార్క్‌కు చెందిన ప్రముఖ క్రీడాకారిణి మియా బ్లిచ్‌ఫెల్డ్‌ను ఇంటిముఖం పట్టించిన రక్షిత, వరుసగా రెండో మ్యాచ్‌లోనూ స్టార్ షట్లర్‌కు షాక్ ఇవ్వడం విశేషం. 2026 సీజన్ ఆరంభం నుంచే రక్షిత రామ్‌రాజ్ వరుస విజయాలతో విశేషంగా రాణిస్తోంది. ఇప్పటికే హనోయ్ ఇంటర్నేషనల్ ఛాలెంజ్, తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ ఛాలెంజ్ టైటిళ్లను గెలుచుకుని తన ప్రతిభను నిరూపించుకుంది. అంతేకాకుండా కొరియా మాస్టర్స్‌లో సెమీఫైనలిస్ట్‌గా నిలవడంతో పాటు వియత్నాం ఓపెన్‌లో మూడో స్థానం దక్కించుకుని నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఆ విజయాల స్ఫూర్తితో ఇప్పుడు హాంకాంగ్ ఓపెన్ వంటి ప్రతిష్ఠాత్మక సూపర్ 500 టోర్నీలో క్వార్టర్ ఫైనల్‌కు చేరి కెరీర్‌లో మరో కీలక ముందడుగు వేసింది.

తన తదుపరి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో థాయిలాండ్‌కు చెందిన స్టార్ షట్లర్ పార్న్‌పావీ చోచువాంగ్‌తో రక్షిత అమీతుమీ తేల్చుకోనుంది. ప్రస్తుతం ఉన్న అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ ఈ మ్యాచ్‌లోనూ గెలిస్తే సెమీఫైనల్ బెర్త్ ఖరారవుతుంది. చిన్న వయసులోనే ఒలింపిక్ ఛాంపియన్ వంటి దిగ్గజ ఆటగాళ్లను ఓడిస్తూ రక్షిత చూపుతున్న ప్రతిభ, పోరాట పటిమ భారత బ్యాడ్మింటన్ వర్గాల్లో సరికొత్త ఆశలను రేకెత్తిస్తున్నాయి. భవిష్యత్తులో భారత మహిళల బ్యాడ్మింటన్‌కు ఆమె మరో బలమైన ఆశాకిరణంగా నిలుస్తుందన్న విశ్వాసం క్రీడాభిమానుల్లో వ్యక్తమవుతోంది.

# సిరాజ్‌ను తప్పించడం తప్పు కాదు: కోటక్

- పిచ్ పరిస్థితుల మేరకే తుది జట్టు కూర్పు
- సీమ్, స్వింగ్ కలయికకే ప్రాధాన్యం ఇచ్చాం
- లెఫ్ట్ హ్యాండర్ల కోసమే సుందర్‌కు అవకాశం
- తొలి రోజు ఆట తర్వాత అసిస్టెంట్ కోచ్ వివరణ

**వెల్లింగ్టన్, నవంబర్ 19 (సమయం న్యూస్) :** న్యూజిలాండ్‌తో బేసిన్ రిజర్వ్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టు తుది జట్టు నుంచి స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌ను తప్పించడంపై టీమిండియా అసిస్టెంట్ కోచ్ సితాన్షు కోటక్ స్పష్టతనిచ్చారు. సిరాజ్ ప్రపంచ స్థాయి బౌలర్ అయినప్పటికీ, కేవలం పిచ్ పరిస్థితులకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు. ఇందులో ఎలాంటి తప్పిదం లేదని గట్టిగా సమర్థించుకున్నారు. తొలి రోజు ఆట ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన కోటక్.. పేసర్ల ఎంపిక, జట్టు కూర్పు వెనుక ఉన్న వ్యూహాలను వివరంగా వెల్లడించారు. అనుభవజ్ఞుడైన సిరాజ్‌ను ఈ మ్యాచ్‌లో పక్కనపెట్టడం ఎంతమాత్రం పొరపాటు కాదని కోటక్ తేల్చిచెప్పారు. "నా దృష్టిలో ఇది



ఏమాత్రం తప్పుడు నిర్ణయం కాదు. జట్టు యాజమాన్యం పిచ్ స్వభావం, ప్రత్యర్థి బలాబలాలను క్షుణ్ణంగా అంచనా వేసి అత్యుత్తమ ప్లేయింగ్ ఎలెవన్‌ను బరిలోకి దించింది. ఇటీవల సిరాజ్ శ్రీలంకలో ఆడిన పరిస్థితులు వేరు, ఇక్కడి పరిస్థితులు వేరు. సిరాజ్‌కు ఎలాంటి సమస్యా లేదు. ఇది పూర్తిగా పరిస్థితుల ఆధారంగా తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయం మాత్రమే" అని ఆయన పేర్కొన్నారు. బేసిన్ రిజర్వ్ పిచ్‌పై దట్టమైన గడ్డి ఉన్న నేపథ్యంలో వేగం, సీమ్, స్వింగ్ రాబట్టగల కాంబినేషన్‌కు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. ఇద్దరు సీమ్ బౌలర్లు, ఇద్దరు స్వింగ్ బౌలర్లు అవసరమనే ఉద్దేశంతోనే ఈ పేస్ దాడిని ఎంచుకున్నామని చెప్పారు. కేవలం తొలి రోజు మాత్రమే కాకుండా, ఐదు రోజుల ఆటను దృష్టిలో పెట్టుకుని బౌలర్లను ఎంపిక చేసినట్లు కోటక్ వివరించారు.

### సుందర్ ఎంపికకు కారణమిదే

తొలి రోజు ఆటలో యువ పేసర్ అన్షుల్ కాంబోజ్ బౌలింగ్ వేగం తగ్గడంపై ఎదురైన ప్రశ్నకు కోటక్ స్పందిస్తూ అతడిని వెనకేసుకొచ్చారు. మూడో స్పెల్‌లో కాస్త వేగం తగ్గినప్పటికీ, ఆరంభంలో కాంబోజ్ మంచి వేగంతోనే బౌలింగ్ చేశాడని సమర్థించారు. పిచ్‌పై గడ్డి ఉన్నప్పుడు బంతి నెమ్మదిగా వెళ్తే బ్యాటర్లకు షాట్లు ఆడేందుకు తగిన సమయం దొరుకుతుందని, అందుకే వేగం అత్యంత కీలకమని విశ్లేషించారు. మరోవైపు రవీంద్ర జడేజాను కాదని వాషింగ్టన్ సుందర్‌ను ఏకైక స్పిన్నర్‌గా ఎంపిక చేయడంపైనా ఆయన స్పష్టతనిచ్చారు. న్యూజిలాండ్ టాప్ ఆర్డర్‌లో నలుగురు ఎడమచేతి వాటం బ్యాటర్లు ఉన్నందునే ఆఫ్ స్పిన్నర్ అయిన సుందర్‌కు తుది జట్టులో ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆరంభంలో మెరుగైన ఫలితం దక్కింది. పేసర్ల ధాటికి న్యూజిలాండ్ 70 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే ఆ తర్వాత నికోల్స్, ఫిలిప్స్ జోడీని విడదీయడంలో భారత బౌలర్లు విఫలమయ్యారు. వీరిద్దరూ క్రీజులో పాతుకుపోయి పోరాడటంతో కివీస్ తిరిగి పుంజుకుని తొలి రోజు ఆట ముగిసే సమయానికి 82 ఓవర్లలో 5 వికెట్లకు 243 పరుగులు చేసింది. ఈ నేపథ్యంలో తుది జట్టు ఎంపికపై తలెత్తిన సందేహాలకు కోటక్ తన వివరణ ద్వారా స్పష్టతనిచ్చే ప్రయత్నం చేశారు.



# భారీ స్కోర్లతోనే ఆర్యవీర్‌కు గౌరవం

### ఇంటిపేరు విమర్శలకు ఆటతోనే జవాబిచ్చాడు

### అండర్-19 ఆసియా కప్‌లో 361 పరుగులతో సత్తా

### మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ హర్షం

**న్యూఢిల్లీ, నవంబర్ 19 (సమయం న్యూస్) :** ప్రముఖుల సంతానం అనే కారణంతో ఎదురయ్యే విమర్శలను ఎవరూ ఆపలేరని, మైదానంలో భారీ పరుగులు సాధించడం ద్వారానే తన కుమారుడు ఆర్యవీర్ క్రికెట్ ప్రపంచంలో తగిన గౌరవాన్ని సంపాదించుకున్నాడని భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అన్నాడు. ఇటీవల ఒమన్‌లో జరిగిన ఏసీసీ పురుషుల అండర్ఉ19 ఆసియా కప్‌ను భారత్ కైవసం చేసుకోవడంలో ఆర్యవీర్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో సెహ్వాగ్ మాట్లాడుతూ.. పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్లో ఆర్యవీర్ రాణించడం ఎంతో సంతోషాన్నిచ్చిందని తెలిపాడు. క్రికెట్‌లో గౌరవం దక్కాలంటే పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడాల్సిందేనని ఎప్పుడూ చెప్పేవాడినని, ఈ టోర్నీలో ఆర్యవీర్ అదే చేసి చూపించాడని పేర్కొన్నాడు. ఇంటిపేరు చూసి విమర్శించే వారికి ఆటతీరుతోనే సమాధానం చెప్పాలని, భవిష్యత్తులోనూ అతడు దేశ ప్రజల ప్రేమాభిమానాలను పొందుతాడని ఆశాభావం వ్యక్తం చేశాడు.

ఈ టోర్నమెంట్‌లో ఆర్యవీర్ సెహ్వాగ్ 5 మ్యాచ్‌లలో 90.25 సగటుతో ఒక సెంచరీ, మూడు అర్ధశతకాలతో కలిపి మొత్తం 361 పరుగులు సాధించాడు. అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచి 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డును సొంతం చేసుకున్నాడు. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో పాకిస్థాన్ నిర్దేశించిన 338 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ ఒక వికెట్ తేడాతో చివరి బంతికి ఛేదించి, రికార్డు స్థాయిలో తొమ్మిదోసారి అండర్ఉ19 ఆసియా కప్ టైటిల్‌ను ముద్దాడింది. ఈ కీలక పోరులో ఆర్యవీర్ 58 పరుగుల బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయానికి బలమైన పునాది వేశాడు.



# నవంబర్ 27న శర్వానంద్ 'భోగి'

## ప్రపంచవ్యాప్తంగా పాన్ ఇండియా స్థాయిలో విడుదల
## 1960ల నేపథ్యంలో 'గంగ'గా పవర్‌ఫుల్ పాత్ర
## సంపత్ నంది దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామా




**హైదరాబాద్, నవంబర్ 19 (సమయం న్యూస్):** శర్వానంద్ కథానాయకుడిగా, సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'భోగి' విడుదల తేదీ ఖరారైంది. ఈ చిత్రాన్ని నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ శ్రీ సత్యసాయి ఆర్ట్స్ గురువారం అధికారికంగా ప్రకటించింది. వాస్తవానికి నవంబర్ 12నే సినిమాను విడుదల చేయాలని భావించినా, అనివార్య కారణాలు, నిర్మాణ పనుల్లో జాప్యం వల్ల వాయిదా పడింది. వెండితెరపై అద్భుతమైన యాక్షన్, భావోద్వేగాలను అందించేందుకు నిబద్ధతతో రూపొందించామని, ప్రేక్షకుల నిరీక్షణకు తగినట్లుగా సినిమా ఉంటుందని చిత్రబృందం తెలిపింది.

1960ల ప్రారంభ కాలం నాటి నేపథ్యంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఓ కల్పిత గ్రామం ఆధారంగా ఈ హైఓల్టేజ్ యాక్షన్ డ్రామాను రూపొందిస్తున్నారు. ఇందులో శర్వానంద్ 'గంగ' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తుండగా, అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి కథానాయికలుగా కనిపించనున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం, కిశోర్ కుమార్ అరోకియా సినిమాటోగ్రఫీ, కిరణ్ కుమార్ మన్నె ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తున్నారు.

# టాలీవుడ్‌కు దూరం కాలేదు: శ్రీలీల



హైదరాబాద్, నవంబర్ 19 (సమయం న్యూస్) : తెలుగు చిత్ర పరిశ్రమకు తాను దూరం కాలేదని, చదువు కారణంగానే కొత్త సినిమాలు అంగీకరించలేకపోయానని నటి శ్రీలీల స్పష్టం చేసింది. హైదరాబాద్‌లో జరిగిన 'ఓం' (ఓ.ఎం: ఆపరేషన్ మోల్) చిత్ర ప్రీరిలీజ్ వేడుకలో పాల్గొన్న ఆమె, కొంతకాలంగా తెలుగు సినిమాల్లో కనిపించకపోవడంపై జరుగుతున్న ప్రచారానికి తెరదించింది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత నిబంధనల ప్రకారం రెండేళ్ల పాటు మెడికల్ ఇంటర్న్‌షిప్ చేయాల్సి వచ్చిందని తెలిపింది. ముంబైలోని డీవై పాటిల్ యూనివర్సిటీలో ప్రత్యక్షంగా హాజరుకావడం తప్పనిసరి కావడంతో షూటింగ్‌లకు సమయం కేటాయించలేకపోయానని, ఆ సమయంలో కేవలం 'ఓం' చిత్రానికి మాత్రమే సంతకం చేశానని వివరించింది. మెడిసిన్ తప్ప టాలీవుడ్‌కు దూరంగా ఉండటానికి మరే కారణం లేదని తేల్చిచెప్పింది. తన కెరీర్ గురించి శ్రీలీల మాట్లాడుతూ.. "చాలా చిన్న వయసులో నటిగా ప్రయాణం మొదలుపెట్టాను. తొలిరోజుల్లో సినిమాల ఎంపికలో నాకు పెద్దగా స్వేచ్ఛ ఉండేది కాదు. వచ్చిన అవకాశాలను అంగీకరిస్తూ ముందుకు వెళ్లాను. కొన్ని చిత్రాల తర్వాత తప్పులు ఎక్కడ జరుగుతున్నాయో అర్థమైంది. ఇప్పుడు సినిమాల ఎంపికలో పరిణతి వచ్చింది" అని పేర్కొంది. ధనుష్ కథానాయకుడిగా నటించిన 'ఓం' చిత్రం నవంబర్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. మెడికల్ బాధ్యతలు పూర్తి కావడంతో త్వరలోనే మరిన్ని తెలుగు ప్రాజెక్టులతో శ్రీలీల సందడి చేయనుంది.

# అనిరుధ్–కావ్య పెళ్లి ఫొటోలు వైరల్

## గ్రీస్‌లో వైభవంగా జరిగిన వివాహ వేడుక

**చెన్నై, నవంబర్ 19 (సమయం న్యూస్) :** సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, ప్రముఖ వ్యాపారవేత్త కావ్యా మారన్ వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఇటీవల గ్రీస్‌లో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో వీరి వివాహం శాస్త్రోక్తంగా, వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సూపర్ స్టార్ రజనీకాంత్, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్ కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. తాజాగా అనిరుధ్ తన పెళ్లికి సంబంధించిన సరికొత్త ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఒక ఫొటోలో అనిరుధ్ కావ్యను ఆత్మీయంగా ఆలింగనం చేసుకోగా, మరో ఫొటోలో ఆమె కోసం స్వయంగా మైక్ పట్టుకుని పాట పాడుతూ కనిపించారు. ఇంకో ఫొటోలో నూతన దంపతులు చేతిలో చేయి వేసి ర్యాంప్ వాక్ చేస్తూ సందడి చేశారు. ఈ ఫొటోలు వైరల్ కావడంతో "క్యూట్ కపుల్" అంటూ అభిమానులు, నెటిజన్లు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. నవంబర్ 21న చెన్నైలో వీరి వివాహ రిసెప్షన్‌ను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకకు సినీ, రాజకీయ, వ్యాపార రంగాల ప్రముఖులు భారీగా హాజరుకానున్నారు.

# ఆకలి రోజుల్లో చిరంజీవి ఇంట్లో తిన్నా: నాజర్

**చెన్నై, నవంబర్ 19 (సమయం న్యూస్) :** సినీ పరిశ్రమలో నిలదొక్కుకునే క్రమంలో తాను ఎన్నో ఆకలి రోజులను చూశానని, ఆ క్లిష్ట సమయంలో మెగాస్టార్ చిరంజీవి కుటుంబం అందించిన సాయం వెలకట్టలేనిదని సీనియర్ నటుడు నాజర్ భావోద్వేగంతో గుర్తుచేసుకున్నారు. అవకాశాల కోసం చెన్నైలో తిరుగుతున్న రోజుల్లో భోజనానికి కూడా ఇబ్బంది పడిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. అలాంటి సమయాల్లో తన స్నేహితుడి ద్వారా చిరంజీవి అర్ధాంగి సురేఖను సంప్రదించి, భోజనం ఉందని తెలియగానే వారి ఇంటికి వెళ్లి తిని వచ్చేవాడినని చెప్పారు. అప్పట్లో వరుస షూటింగ్‌లతో బిజీగా ఉండే చిరంజీవికి తాను వచ్చి భోజనం చేసిన విషయం ఒక్కోసారి తెలిసేది కూడా కాదని వివరించారు.



తనలోని ప్రతిభను గుర్తించి తండ్రి నటన వైపు ప్రోత్సహించారని నాజర్ తెలిపారు. చెన్నైలో ఓ చిన్న ఉద్యోగం చేస్తూ, యాక్టింగ్ స్కూల్ ఫీజు కోసం ఆఫీసు తర్వాత అదనపు పనులు చేసి డబ్బు ఆదా చేసుకున్నానని, నటుడిగా నిలదొక్కుకోవడానికి దాదాపు 15 ఏళ్లు పట్టిందని చెప్పారు. వెంకటేశ్ హీరోగా వచ్చిన 'చంటి'తో తెలుగులో అరంగేట్రం చేశానని, అప్పుడు తనకు తెలుగు అస్సలు రాకపోయినా స్టార్ హీరో అయి ఉండి కూడా వెంకటేశ్ ఎంతో ఓపికగా ప్రతి డైలాగ్‌ను, పాత్ర స్వభావాన్ని వివరించి ప్రోత్సహించారని గుర్తుచేసుకున్నారు. కష్టకాలంలో చిరంజీవి, సురేఖ చూపిన దాతృత్వం, వెంకటేశ్ సహకారాన్ని ఎప్పటికీ మరువలేనని, ఎలాంటి గుర్తింపు ఆశించకుండా నిస్వార్థంగా చేసే సాయమే అత్యంత గొప్పదని నాజర్ పేర్కొన్నారు.

# బంగారమిచ్చి ధన్‌రాజ్‌ను ఆదుకున్న భార్య

## తల్లి అంత్యక్రియలకూ డబ్బుల్లేని స్థితిలో శిరీష సాయం



**హైదరాబాద్, నవంబర్ 19 (సమయం న్యూస్) :** హాస్యనటుడు ధన్‌రాజ్ కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న తీవ్ర ఆర్థిక కష్టాలు, ఆ క్లిష్ట సమయంలో ఆయన భార్య శిరీష అందించిన అండను ఆమె ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. విజయవాడకు చెందిన ధన్‌రాజ్ హైదరాబాద్ ఫిల్మ్ నగర్‌లో ఓ డ్యాన్స్ స్టూడియో ఏర్పాటు చేసి, శిక్షకురాలి కోసం చూస్తున్న క్రమంలో ఖమ్మం ప్రాంతానికి చెందిన శాస్త్రీయ నృత్య కళాకారిణి శిరీషతో తొలిసారి పరిచయమైంది. సరిగ్గా వీరిద్దరూ కలుసుకున్న రోజే ధన్‌రాజ్ తల్లి క్యాన్సర్‌తో తుదిశ్వాస విడిచారు. ఆ సమయంలో ధన్‌రాజ్ వద్ద కనీసం తల్లి అంత్యక్రియలు నిర్వహించడానికి కూడా డబ్బుల్లేని దయనీయ స్థితి నెలకొంది. ఆ క్లిష్ట పరిస్థితుల్లో శిరీష తన దగ్గరున్న బంగారాన్ని మొత్తం ధన్‌రాజ్‌కు ఇచ్చి ఆదుకున్నారు. ఆ తర్వాత ఇరు కుటుంబాల నుంచి వ్యతిరేకత ఎదురైనా శిరీష ముందడుగు వేసి ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పుడు ఆమె వయసు 15 ఏళ్లేనని ఇంటర్వ్యూలో వెల్లడించారు. వీరి పెళ్లయిన మూడో రోజే ధన్‌రాజ్ నటించిన 'జగడం' చిత్రం విడుదలై నటుడిగా మంచి గుర్తింపు తెచ్చింది. అనంతరం 'పరుగు', 'యువత', 'పిల్ల జమీందార్', 'గబ్బర్ సింగ్', 'అత్తారింటికి దారేది', 'గోపాల గోపాల' సహా 80కి పైగా సినిమాల్లో నటించి ధన్‌రాజ్ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**